కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
సోమవారం 07 సెప్టెంబర్ 2026

## పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, మరియు ఇతర సామగ్రి పంపిణీ చేసిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



రాయచోటి సెప్టెంబర్ 6 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా రాయచోటి మున్సిపాలిటీ ఆవరణంలో మున్సిపల్ కమిషనర్ పీ రమణా రెడ్డి ఆధ్వర్యంలో, రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, పాదరక్షలు, కొబ్బరి నూనె మరియు సబ్బులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు మాట్లాడుతూ: పారిశుద్ధ్య కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న 160 మంది హాజరై, మంత్రి రాంప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా దుస్తులు, పాదరక్షలు, కొబ్బరి నూనె మరియు సబ్బులను అందుకోవడం మాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని శానిటేషన్ సిబ్బంది సంతోషాన్ని వెలబుచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి,రాయచోటి మున్సిపల్ కమిషనర్ పి రమణారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## వేగవంతంగా సాగుతున్న ఇంధన విద్యుత్ ప్రసార ప్రాజెక్టు పనులు



కడప కార్పొరేషన్ సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:

పునరుత్పాదక ఇంధన విద్యుత్ ప్రసార ప్రాజెక్టు పనులు కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశాల మేరకు అనంతపురం నుంచి కడప జిల్లా సీకే దిన్నె వరకు నిర్మాణం వేగవంతం అవుతుంది. జె. సి నిధి మీనా, ఎస్పీ షెల్కే నాచికేత్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఆర్డీవో, తహశీల్దార్ తదితర క్షేత్రస్థాయి అధికారులు రాధిక పనులు పర్యవేక్షిస్తున్నారు. కడప శివారు సికె దిన్నెలో జరిగిన సమావేశానికి సమావేశానికి వంద మందికి పైగా రైతులు హాజరయ్యారు. ప్రాజెక్టు ట్రాన్స్‌మిషన్ లైన్లు, టవర్ల ఏర్పాటు వల్ల రైతుల భూముల యాజమాన్య హక్కులు ఎప్పటికీ వారి వద్దే ఉంటాయని, ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్ నిబంధనల ప్రకారం పంట, చెట్ల నష్టానికి ప్రభుత్వం నేరుగా డీడీ రూపంలో పరిహారం చెల్లిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. సాంకేతిక నిపుణులు, పీఎఫ్‌సీ, ఉపగ్రహ సర్వేల ద్వారా భద్రతను పరిగణనలోకి తీసుకుని రూట్ ఖరారు చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు అభివృద్ధి లక్ష్యాలకు, కేంద్ర పునరుత్పాదక ఇంధన లక్ష్యాలకు అనుగుణంగా రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్టు రాయలసీమ పారిశ్రామికాభివృద్ధికి, స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఎంతో కీలకమని జిల్లా అధికారులు, రెసోనియా ప్రాజెక్టు ప్రతినిధులు తెలిపారు.

# దిగువ ఆయకట్టు రైతులకు ఊరట

### వెలిగల్లు కుడి కాలువకు సాగునీటి విడుదల

### 0.5 టీఎంసీల నీటిని విడుదల చేసిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి





గాలివీడు, సెప్టెంబర్ 6. ప్రభాతవార్త.

దిగువ ఆయకట్టు రైతుల సాగునీటి అవసరాలను తీర్చేందుకు వెలిగల్లు ప్రాజెక్టు కుడి కాలువ నుంచి నీటిని విడుదల చేశారు. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కుడి కాలువకు నీటి విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దిగువ ఆయకట్టు పరిధిలోని రైతుల పంట పొలాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో 0.5 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నీటి విడుదలతో దిగువ ప్రాంతాల్లోని కాలువలు, చెరువులకు నీరు చేరడంతో పాటు రైతుల పంటలకు సాగునీరు అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఇరిగేషన్ శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. రైతుల సంక్షేమం, సాగునీటి వసతుల మెరుగుదలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, తెలుగుదేశం పార్టీ మండల నాయకులు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**రూ.1.10 కోట్లతో రూపుదిద్దుకుంటున్న ఎన్టీఆర్ మెమోరియల్ పార్క్ పనుల పరిశీలన**

గాలివీడు పట్టణ అభివృద్ధికి మరో ఆకర్షణగా నిలవనున్న ఎన్టీఆర్ మెమోరియల్ చిల్డ్రన్స్ పార్క్ నిర్మాణ పనులను రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, టీడీపీ నాయకులు డాక్టర్ మండిపల్లె లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పరిశీలించారు. గాలివీడు మండల పర్యటనలో భాగంగా పట్టణ కేంద్రంలోని గేట్ సర్కిల్ సమీపంలో పెద్ద చెరువు కట్టను ఆనుకుని దాదాపు రూ.1.10 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఎన్టీఆర్ మెమోరియల్ చిల్డ్రన్స్ పార్క్‌ను అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. పిల్లలకు ఆహ్లాదకరమైన, సురక్షితమైన వాతావరణం కల్పించేలా పార్క్‌ను అన్ని హంగులతో సుందరంగా అభివృద్ధి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అవసరమైతే అదనపు నిధులు కేటాయించి పార్క్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. గాలివీడు పట్టణ ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ మండిపల్లె లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మంత్రి వెంట ఉండి పార్క్ నిర్మాణ పనులను పరిశీలించారు. గాలివీడు పట్టణానికి ఎన్టీఆర్ మెమోరియల్ పార్క్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా అభివృద్ధి చేయాలని సూచించారు. అనంతరం గాలివీడు పట్టణంలోని గేట్ సర్కిల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ కార్యాలయం ప్రజలకు, పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా నిలవాలని ఆకాంక్షించారు.

## మెగా డీఎస్సీపై కూటమి ప్రభుత్వం మోనం వీడాలి

సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలి
విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి
వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రామ్ లక్ష్మణ్ రెడ్డి



పులివెందుల, సెప్టెంబర్ 6 ప్రభాత వార్త :

మెగా డీఎస్సీ నియామక ప్రక్రియపై అభ్యర్థులు, నిరుద్యోగుల్లో వ్యక్తమవుతున్న అనుమానాలు, ఆరోపణలపై కూటమి ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రామ్ లక్ష్మణ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పులివెందుల పట్టణంలోని భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్ లక్ష్మణ్ రెడ్డి మాట్లాడుతూ డీఎస్సీ నియామకాల్లో అర్హత లేని అభ్యర్థులకు ఉద్యోగాలు కట్టబెట్టారంటూ ఆరోపణలు, ఫిర్యాదులు వస్తున్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. నియామక ప్రక్రియ అంతా పారదర్శకంగా జరిగిందని ప్రభుత్వం చెబుతున్నప్పుడు, స్వతంత్ర సంస్థ అయిన సీబీఐతో విచారణ చేయించడానికి వెనుకాడాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. ఏళ్ల తరబడి కష్టపడి చదివి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడకూడదని అన్నారు. కర్నూలు జిల్లా కౌతాళం మండలంలో నకిలీ జూడో సర్టిఫికెట్లు, ఇతర ధ్రువపత్రాల ఆధారంగా కొందరు ఉద్యోగాలు పొందారంటూ వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాలని కోరారు. డీఎస్సీ నియామకాలకు సంబంధించి టెట్ అర్హతలు, స్పోర్ట్స్ కోటా, సర్టిఫికెట్ల పరిశీలన, మెరిట్ జాబితా, ఎంపిక ప్రక్రియ, పోస్టింగ్ ఆర్డర్ల వరకు ప్రతి దశను క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. దరఖాస్తు దశలోనే అర్హతలను పరిశీలించాల్సి ఉండగా, తదుపరి దశలను కొందరు ఎలా దాటగలిగారో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత కూడా అర్హతలపై ప్రశ్నలు తలెత్తడంపై సమాధానం చెప్పాలన్నారు. ప్రభుత్వ అధికారులతోనే విచారణ జరిపించడం వల్ల ప్రజల్లో ఉన్న అనుమానాలు పూర్తిగా నివృత్తి కావని, అందువల్ల డీఎస్సీ నియామక వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించి సమగ్ర దర్యాప్తు చేయించాలని రామ్ లక్ష్మణ్ రెడ్డి కోరారు. ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గతంలో డీఎస్సీ ఉద్యోగాలపై ..మిగతా 3పేజీలో

### గ్యాంబ్లింగ్ ఉచ్చులో యువత..

## కుటుంబాలు చిన్నాభిన్నం

### మందు, విందుతో ఆకర్షణ.. బాడుగ వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలింపు!

### కమిషన్ల కోసం అమాయక యువత జీవితాలతో చెలగాటం




ముద్దనూరు, సెప్టెంబర్ 06 ప్రభాతవార్త:

ముద్దనూరు మండలంలో కొందరు వ్యక్తులు గ్యాంబ్లింగ్‌ను ఒక వ్యాపారంగా మార్చుకుని యువతను దానికి బానిసలుగా మారుస్తున్నారనే ఆరోపణలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. గ్యాంబ్లింగ్‌తో పాటు మందు, విందు వంటి సౌకర్యాలు కల్పిస్తామంటూ అమాయక యువతను ఆకర్షించి, ముద్దనూరు నుంచి బాడుగ వాహనాల్లో సింహాద్రిపురం, తాడిపత్రి తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఒక్కొక్కరిని ఆటలకు తీసుకెళ్లినందుకు రూ.500 నుంచి రూ.1,000 వరకు కమిషన్ పొందుతున్నారని వారు వాపోతున్నారు. ఈ వ్యవహారం కారణంగా పలువురు యువకులు అప్పుల ఊబిలో కూరుకుపోయి కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులు, మనస్పర్థలు ఏర్పడుతున్నాయని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కుటుంబ సభ్యులు మందలించినప్పటికీ, కొందరు వ్యక్తులు తాము గ్యాంబ్లింగ్ ఆటలు నిర్వహించడం ద్వారానే జీవిస్తున్నామని బహిరంగంగా చెబుతున్నారని వారు పేర్కొంటున్నారు. గ్యాంబ్లింగ్‌తో పాటు మట్కా వంటి ఇతర అసాంఘిక కార్యకలాపాలు కూడా కొనసాగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. యువతను డబ్బు ఆశతో ఈ వ్యసనాల వైపు మళ్లిస్తూ వారి భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న వారిపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా గ్యాంబ్లింగ్ నిర్వహించే వారితో పాటు యువతను ప్రోత్సహించి, ఇతర ప్రాంతాలకు తరలించే వ్యక్తులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఈ వ్యవహారానికి అడ్డుకట్ట వేసి యువతను, వారి కుటుంబాలను అప్పుల ఊబి నుంచి కాపాడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

### ముంచుకొస్తున్న కరువు, కుంటుబడిన వ్యవసాయం,

## కష్టాల్లో రైతాంగం



రాజుపాలెం, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త.

వానరాక పంటసాగే లేక కరువు తరుముకొస్తుంటే బ్రతుకుతెరువు ఎలా అని రైతాంగంలో భయాందోళన మొదలైంది. ప్రభుత్వానికి కరువు కనిపించదా పాలకులకు పట్టదా అని వ్యవసాయమును రైతాంగాన్ని రైతు కూలీలను ఆదుకోవాల్సిన బాధ్యత లేదా అని గ్రామాల్లో చర్చ మొదలైనది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం రోజుల నుండి పొలాలన్నీ దుక్కులు దున్ని పంటసాగు సిద్ధమైన రైతులు జూన్ నెల నుండి వర్షం కోసం ఎదురుచూసినా మంచి వర్షం కురిసింది లేదు పొలం పదునైంది లేదు విత్తనాలు నాటుదామని సిద్ధంగా ఉన్నా నిరాశ మిగిల్చింది. జూలై మాసంలో ఆకాశం వైపు ఎదురుచూసి రైతన్నకు కన్నులు కాయలు కాసి నిరాశే మిగిలింది, ఆగస్టు నెలలో శ్రావణమాసం మొదలైందని ఎన్నో ఆశలు పెట్టుకున్నా చినుకు జాడేలేదు వర్షం ఊసే లేదు, ఎప్పుడుచూసినా శ్రావణమాసంలో పచ్చని పంట పొలాలతో రైతులకు రైతు కూలీలకు చేతినిండా పని, వర్షాలతో ఎక్కడ చూసినా వంకలు వాగులుఉప్పొంగి ప్రవహించేవి, ఈ ఏడాదిచూస్తే వంకలు, వాగులు, కుంటలు నీళ్లే లేక ఎండిపోతున్నాయి. వానాకాలంలో ఎండాకాలంను తలపిస్తూ ఉక్కపోతతో మండుటెండలు మెండుగా ఉన్నాయి ఇదేందిరా ఇది వానాకాలమా ఎండాకాలమా అని ప్రజల అవాక్కవుతున్నారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు సాగుఅయ్యింటే పంట పొలాలు పచ్చని పంటలతో కలకలాడాల్సిన రోజుల్లో ఎటు చూసినా బీడు భూముల దర్శనమిస్తున్నాయి. నీటి ఆధారం ఉన్న పొలాల్లో అక్కడక్కడ అరకొరగా పంటసాగైనా ఎండలకు ఎండిపోతుంటే అష్ట కష్టాలు పడి నీటి తడులు అందిస్తున్నా పంట అంత ఆశాజనకంగా లేదు ఎందుకు పంట సాగు చేసాం రా బాబు అని అనుకుంటున్నారు, ఈ సాగు కూడా సాగు కావలసిన పొలంలో 10 శాతం కూడా ఉండదు. గ్రామాల్లో కరువుతో వ్యవసాయ పంటలు సాగు చేయక రైతులు రైతు కూలీలు పని పాట లేక చెట్ల కింద గోడల కింద ఉస్సూరుమనీ కాలక్షేపం చేస్తున్నారు. పాడి పంట ఒక జంట అని అవి రైతన్నకు రెండు కళ్ళని అంటుంటారు పంట లేకున్నా పాడినైనా నమ్ముకుందామన్నా మూడు నెలల నుంచి వర్షాలు లేక పచ్చి గడ్డి కరువై, పశువులకు మేత కొదవవై పశుపోషణే భారమైందని ఒకింత ఆందోళన చెందుతున్నారు. మనుషులకు ఆహారం, పశువులకు మేత ఎలాగని రైతన్న ఆలోచనలో పడ్డారు. యల్ ని నో ప్రభావంతో ఈ ఏడాది అంతా వర్షాలు లేవని వాతావరణ శాఖ హెచ్చరికలతో మరింత ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయం కుంటుపడితే దానిపై ఆధారపడి ఉన్న ఎన్నో అనుబంధ సంస్థలు వ్యవస్థలు గడ్డుకాలం మొదలైనట్లే అని ఆ ఆయా వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. కరోనాకాలంలో సంక్షోభం ఎదురైతే మన సమాజంలో తిండికి కరువు లేకుండా ఆర్థిక ఇబ్బంది పడకుండా ఈ వ్యవసాయమే మనల్ని కాపాడింది అని మనందరికీ తెలుసు అదే వ్యవసాయం ఇప్పుడు కరువుతో కుంటుబడితే ప్రజల జీవనం ఎలా ఉంటుందో అని అందరిలో భయం మొదలైంది. దీనిపైన ప్రభుత్వాలు పాలకులు , ప్రత్యేక శ్రద్ధతో ప్రత్యామ్నాయ మార్గాలను ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలుచర్చించు కుంటూ, ప్రభుత్వం చేపట్టబోయే విధివిధానాలపైఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

## కాలువ కింద పంటలు సాగు చేయవద్దు

వార్త 4వ పేజీలో

## ఉద్యోగుల డిమాండ్లు తీర్చిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

ఎన్జీవో ప్రెసిడెంట్ రామసుబ్బయ్య యాదవ్




ప్రొద్దుటూరు అర్బన్ సెప్టెంబర్ 6 ప్రభాతవార్త

ఏపీ ఎన్జిజివోఖిస్ అసోసియేషన్, ప్రొద్దుటూరు తాలూకా అధ్యక్షులు,జెఏసి ఛైర్మన్ జె.రామ సుబ్బయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం అభినందన సమావేశం నిర్వహించారు. ఈనెల 5వ తేదీన ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలపై ఏపీ యన్జిజిఓస్ రాష్ట్ర అధ్యక్షులు జేఏసీ ఛైర్మన్ కామ్రేడ్ అలపర్తి విద్యాసాగర్ పాల్గొని సమస్యలపై సుదీర్ఘ చర్చలు జరిపి రావలసిన డిమాండ్స్ సాధించారన్నారు. ఈ చర్చలలో 12వ శిలిది నియామకానికి అంగీకారం, రెండు డిఎలు 2026 అక్టోబర్ 1 నుంచి చెల్లింపు, 1 72024, 112025 డీఏలు విడుదల,2022 సంవత్సరానికి సంబంధించి సరెండర్ లీవ్స్ వచ్చే సంక్రాంతికి అకౌంట్ లో వేయడానికి అంగీకారం, పోలీసులకు ఒక అడిషనల్ సరెండర్ లీవ్ ఈ దసరాకి చెల్లింపు, అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ జనవరి 2027 నుంచి ఇచ్చేందుకు నిర్ణయం,!! 70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిని వారికి 15 శాతం మేర అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ వర్తింపు, ఎంప్లాయిస్ హెల్త్ స్కీంను స్ట్రీమ్ లైన్ వచ్చే నెల నుంచే ఏ నెలకు ఆ నెల ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కు చెల్లింపునకు అంగీకారం, పై డిమాండ్స్ నెరవేర్చినందుకు గాను ముఖ్యమంత్రికి మరియు డిమాండ్స్ సాధించిన ఏపీ యన్జిజిఓస్ రాష్ట్ర అధ్యక్షులు, జేఏసీ ఛైర్మన్ లెజెండరీ లీడర్ కామ్రేడ్ అలపర్తి విద్యాసాగర్ కి, జనరల్ సెక్రటరీ కె యస్. ప్రసాదరావుకి, ప్రధాన సెక్రటరీ డివి.రమణకి, కడప జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులుకి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్ కు తాలూకా అధ్యక్షులు జెఏసి ఛైర్మెన్ జె.రామసుబ్బయ్య యాదవ్ ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్, కోశాధికారి సదాశివయ్య, వైస్ ప్రెసిడెంట్స్ నాగార్జున, వరప్రసాద్, జాయింట్ సెక్రెటరీస్ , సుబ్బారాయుడు, నారాయణరాజు,జెఏసి కో ఛైర్మెన్స్ కంబగిరి యుటిఎఫ్ శశికిరణ్, గోపాల్,ఓంకార్ ,మహేశ్వరయ్య, పెన్షనర్స్ నాగన్న, లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

### వృద్ధురాలి హత్యకేసులో

## ఇద్దరు నిందితుల అరెస్ట్



మదనపల్లె క్రైమ్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త.

వృద్ధురాలి హత్యకేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు డిఎస్పి బుచ్చిరాజు, తాలూకా సిఐ కళా వెంకట రమణలు తెలిపారు. డి.ఎస్.పి, సీఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె మండలం కొండామర్రిపల్లె పంచాయతీ పుంగనూరు వాండ్లపల్లె సమీపంలో ఆర్టీఓ కార్యాలయం ఎదురుగా నూలు లక్ష్మీదేవి (83) అనే వృద్ధురాలు నివాసముంటూ, అక్కడే చిన్న చిల్లర అంగడి, టీ దుకాణం నిర్వహిస్తూ ఒంటరిగా జీవిస్తోంది. ఆర్టీఓ కార్యాలయంలో పార్ట్‌టైమ్ వాచ్‌మన్ అత్తూరి శరచంద్రప్రసాద్ అలియాస్ బాలాజీ (40), స్వీపర్‌గా పనిచేస్తున్న బొమ్మసంద్ర ప్రమీల (46)లు లక్ష్మీదేవితో చనువుగా ఉంటూ, ఆమెకు అవసరమైన వస్తువులు తెచ్చిస్తూ తీవ్ర నమ్మకాన్ని ఏర్పరచుకున్నారు. ఈ క్రమంలో తిరుపతిలో తెలిసిన వారి నామకరణ ఉత్సవం ఉందని నమ్మించి, గత నెల 19న సాయంత్రం కారులో లక్ష్మీదేవిని తీసుకెళ్లారు. రేణిగుంట మండలం, గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని చెరువు పరంబోకు భూమి వద్దకు తీసుకెళ్లి, ఇద్దరూ కలిసి ఆమె గొంతు పిసికి దారుణంగా హత్య చేశారు. అనంతరం ఆమె శరీరంపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకుని, ఆనవాళ్లు దాగడానికి మృతదేహాన్ని సమీపంలోని ఒక ఇంకుడు గుంతలో పూడ్చిపెట్టారు. దర్యాప్తులో భాగంగా శనివారం మధ్యాహ్నం రేణిగుంట తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఎస్.వి . మెడికల్ కాలేజీ ప్రొఫెసర్, వైద్య సిబ్బంది సమక్షంలో లక్ష్మీదేవి మృతదేహాన్ని వెలికితీశారు. సంఘటనా స్థలంలోనే శవపంచనామా, పోస్టుమార్టం పూర్తి చేశారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునిబెల్లి ఆదేశాల మేరకు, మదనపల్లె డిఎస్పీ బుచ్చిరాజు పర్యవేక్షణలో, మదనపల్లె తాలూకా సిఐ కళా వెంకటరమణ ప్రత్యేక బృందంతో దర్యాప్తు వేగవంతం చేశారు. పక్కా సమాచారంతో శనివారం మధ్యాహ్నం గాజులమండ్యం పిఎస్ పరిధిలోని నేరం జరిగిన ప్రాంతం వద్దే నిందితులు అత్తూరి శరచంద్రప్రసాద్, బొమ్మసంద్ర ప్రమీలలను పోలీసులు సాక్షుల సమక్షంలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని డిఎస్పి తెలిపారు. నేరానికి ఉపయోగించిన కారు, దోచుకున్న బంగారు ఆభరణాలను రికవరీ చేయాల్సి ఉందని, ఈ హత్యలో మరికొవరికైనా ప్రమేయం ఉందా అనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నామని డిఎస్పీ తెలిపారు. నేరస్థులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు.

### పీలేరు మండలం మేళ్లచెరువులో

## నైమిశారణ్య ఆశ్రమం వివాదం

### విరాళం ఇచ్చి దౌర్జన్యమా




పీలేరు సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:

అన్నమయ్య జిల్లా పీలేరు మండలం మేళ్లచెరువు గ్రామంలో ఉన్న ముజారా నైమిశారణ్య ఆశ్రమం (మహర్షి చారిటబుల్ ట్రస్ట్) వివాదంలో చిక్కుకుంది. 2011 నుండి భక్తి శ్రద్ధలతో నిర్మించుకున్న ఈ ఆశ్రమానికి రొంపిచెర్ల గ్రామానికి చెందిన శ్యామలమ్మ, ఆమె భర్త ఆనంద్, ఆమె తమ్ముడు అశోక్ వారు అభివృద్ధి కోసం విరాళంగా కొంత నగదు ఇచ్చారని భక్తులు తెలిపారు. అయితే ఆశ్రమం పూర్తిగా నిర్మాణం అయిన తర్వాత ఆశ్రమ బాధ్యతలన్నీ తమకే అప్పగించాలని వారు ట్రస్ట్ సభ్యులను కోరారని, దానికి ట్రస్ట్ సభ్యులు నిరాకరించడంతో కక్ష పెంచుకున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. ట్రస్ట్ సభ్యులను దుర్భాషలాడుతూ, అసభ్య పదజాలంతో దూషిస్తున్నారనిఅన్నారు. ఇచ్చిన విరాళాన్ని అప్పుగా ఇచ్చామంటూ తిరిగి చెల్లించాలని ఒత్తిడి తెస్తూ ఆశ్రమంపై దౌర్జన్యానికి దిగుతున్నారు. విరాళం ఇచ్చేటప్పుడు అభివృద్ధి కోసమేనని చెప్పి ఇప్పుడు మేనేజ్మెంట్ తమకు కావాలంటూ ఆశ్రమంలో ఉండే రమణానంద స్వామిపై దాడికి యత్నించడం, చంపుతామని బెదిరించడం చేస్తున్నారని పీలేరు పోలీసులకు తెలిపారు. అంతేకాకుండా పత్రికల్లో, సోషల్ మీడియాలో ఆశ్రమంపై తప్పుడు వార్తలు రాస్తూ, ఆశ్రమ సభ్యులు ముందు కలిసి డొనేషన్ తీసుకున్నారని, స్వామీజీపై అక్రమ సంబంధాలు అంటగడుతూ దుష్ప్రచారం చేస్తున్నారని, కొంతమంది నాయకుల అండతో ఆశ్రమంపై దాడులు చేస్తున్నారని, స్వామికి రక్షణ కల్పించాలని భక్తులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై అన్నమయ్య జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నైమిశారణ్య ఆశ్రమానికి రక్షణ కల్పించి, దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

## బోధిషావలిని కలిసిన పీలేరులో శ్రీ సత్య సాయి జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ అధ్యక్షులు ఆవుటాల రమణారెడ్డి



పీలేరు సెప్టెంబర్ 6 ప్రభాతవార్త;
శ్రీ సత్యసాయి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా పనిచేసిన ఆవుటాల రమణా రెడ్డి ఆదివారం పీలేరులో అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బోధిషా వలిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు వ్యవసా యం, రైతుల సమస్యలు, ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులు తదితర అంశాలపై చర్చించారు. ముఖ్యంగా రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులు, పంటల సాగులో మారుతున్న పరిస్థితులు, రైతులకు అందాల్సిన ప్రభుత్వ సహాయం వంటి అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. సత్య సాయి, అన్నమయ్య జిల్లాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఎల్ నినో ప్రభావం, తగ్గిన పంట విస్తీర్ణం, వాటిని అధిగమించ డానికి ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలు, ఆ చర్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాల్సిన మార్గాలపై చర్చించారు.

# వడ్డెరలు తమ బిడ్డల భవిష్యత్తు కోసం సమిధలుగా మారాలి

### రాష్ట్ర వడ్డెర సేవాదళ్ సలహాదారు బత్తుల రమణ



తంబళ్లపల్లె సెప్టెంబర్ 6 ప్రభాతవార్త ః
వడ్డెర సోదరులు తమ బిడ్డలు విద్య తోపాటు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయి చేరడానికి సమిధలుగా మారాలని రాష్ట్ర వడ్డెర సేవాదళ్ ఎగ్జిక్యూటివ్ సలహాదారు బత్తుల రమణ చైతన్యపరిచారు. ఆదివారం తంబళ్లపల్లెలో వడ్డెర సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వడ్డెర్లు జనాభా అధికంగా ఉన్న ఓటు బ్యాంకుగా మారారు తప్ప విద్య, రాజకీయ ప్రాధాన్యత లేక అన్ని రంగాలలో వెనుకబడినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ ఆశించిన స్థాయిలో రాణించకపోవడం చదువు లేకపోవడమేనని నేటి నుండే ప్రతి వడ్డెర సోదరుడు ప్రతి బిడ్డను కష్టపడి చదివించాలని ఉన్నత చదువులు చదివితే భవిష్యత్తు బంగారు బాట కాగదని హితవు పలికారు. జిల్లా పరిశీలకులు మేకల చలపతి మాట్లాడుతూ వడ్డెరలు విద్య తో పాటు క్రీడల్లో రాణించి ఉత్తమ ప్రతిభ కనబరిచి వడ్డెర జాతి తలెత్తుకునేలా కష్టపడి తమ పిల్లలను చదివించాలన్నారు. అనంతరం తంబళ్లపల్లెలో టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఒలికి శోభ, సిద్ధప్ప కుమారుడు రెడ్డి బాబు 550 మార్కులు, దేరంగుల భవాని, శివమూర్తి కుమారుడు 523లను బత్తుల రమణ అభినందించి వారికి ఆర్థిక సాయం అందించి వీరిని స్ఫూర్తిగా తీసుకొని వడ్డెర బిడ్డలు చదువులో రాణించాలని ప్రోత్సహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు బత్తల రమణ, చలపతి, నాయకులను కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రేపన మల్లికార్జున, రామలక్ష్మమ్మ, రమేష్ బాబు, రవికుమార్, సంక్రాంతి పండుగ రోజుల్లో రెడ్డప్ప, రాజన్న, ముత్తన మల్లయ్య, దేరంగుల సాంబ, కోటకొండ రామాంజులు, శివ, వలిపి హరి ప్రసాద్ పాల్గొన్నారు.

## డిగ్రీ ప్రవేశాల జాప్యాన్ని నివారించి తరగతులు ప్రారంభించాలి




ఎడ్యుకేషన్ సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:
డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియలో జరుగుతున్న జాప్యాన్ని వెంటనే నివారించి, విద్యార్థుల విద్యా సంవత్సరం నష్టపోకుండా తరగతులను ప్రారంభించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరంలోని పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడి నాలుగు నెలలు గడిచినా డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ పూర్తికాకపోవడం ఆందోళనకరమన్నారు. సీట్ల కేటాయింపును పదేపదే వాయిదా వేయడం వల్ల వేలాది మంది విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారని, విలువైన విద్యా సమయం నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. డిగ్రీ ప్రవేశాల కౌన్సెలింగ్‌ను వెంటనే పూర్తి చేసి, సీట్ల కేటాయింపును పారదర్శకంగా నిర్వహించాలని అంకన్న కోరారు. అనంతరం తరగతులను తక్షణమే ప్రారంభించి విద్యార్థుల విద్యా సంవత్సరం సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయడంతో పాటు, అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రవేశాల ప్రక్రియలో ఇకపై ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, స్పష్టమైన విద్యా క్యాలెండర్‌ను అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కారం చూపకపోతే విద్యార్థుల హక్కుల కోసం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమం చేపడతామని అంకన్న స్పష్టం చేశారు. సమావేశంలో పీడీఎస్‌యూ కడప, అన్నమయ్య జిల్లాల నాయకులు మనోజ్, మహేష్, పండు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ఘనంగా మేల్ దీపోత్సవం



రామసముద్రం సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :
రామసముద్రం మండలంలోని మూగవాడి గ్రామ పంచాయతీ గొల్లపల్లె గ్రామంలో కొలువైన శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం వద్ద మేల్ దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిం చారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు అనిల్ కుమార్ శాస్త్రి శనివారం ఆదివారం రెండు రోజులు పాటు శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో అభిషేకాలు, అర్చనలు ఘనంగా నిర్వహించారు ఆలయ ప్రాంగణం దీపకాంతులతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆలయ ప్రాంగాణం ద్వజ స్థంభం వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తదనంతరం గొల్లపల్లె గ్రామానికి చెందిన లోకేష్ యాదవ్ ప్రత్యేక పూజలు చేసి ద్వజ స్థంభం పైకి చేరి మేలు దీపం వెలిగించారు, అనంతరం భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# నేకనాపురంలో జోరుగా సాగిన టిడిపి ఇంటింటి ప్రచారం



సిద్ధవటం, సెప్టెంబర్6, ప్రభాతవార్త :
నేకనాపురం గ్రామపంచాయతీలో రాజంపేట ఇంచార్జ్ జగన్మోహన్ రాజు ఆధ్వర్యంలో జోరుగా సాగిన ఇంటింటి టిడిపి ప్రచారం టిడిపి నాయకులు కరపత్రాలను ప్రజలకు అందజేశారు అభివృద్ధి సంక్షేమం గురించి ప్రజలకు తెలియజేసినారు గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టి తీసేస్తే వాటిని ఇన్చార్జి ద్వారా పరిష్కారం చేస్తామని తెలిపారు గత వైకాపా పాలనలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు కూడా సరిగా ఇవ్వలేని పరిస్థితుల నుండి ఈరోజు ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీకే వారి జీతాలను ఇస్తున్నారు, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం నుండి వారికి రావలసిన పాత బకాయిలను ఇచ్చేందుకు కూటమిప్రభుత్వం సానుకూలంగా నేతలతో చర్చలు జరిపి ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేశారని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు ఉద్యోగ సంఘాలు కృతజ్ఞతలు తెలిపారు ప్రతి ఇంటికి సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం మా ప్రభుత్వం కష్టపడుతూ ఉందని తెలిపారు ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రాజశేఖర్, క్లస్టర్ ఇంచార్జ్ రాజనాయుడు, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ప్రతినిధి, పార్ల శ్రీనివాసులు, పార్లమెంట్ ఉపాధ్యక్షులు నాగమునిరెడ్డి, రైతు విభాగపు కన్వీనర్ మల్లు వెంకట సుబ్బారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీనివాసులు, ఐ టి డి పి అధ్యక్షులు, పెగడాల హరి ఏఎంసీ డైరెక్టర్, గంగా నందరెడ్డి,, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు, పార్ల రాంప్రసాద్ , టిడిపి నాయకులు కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు

# పుంగనూరులో ఫలించిన ఐక్యత రాగం

### చౌడేపల్లి టీడీపీలో నూతనోత్సాహం



చౌడేపల్లి ఆగష్టు 6 ప్రభాతవార్త :
పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లి మండల తెలుగుదేశం పార్టీలో దీర్ఘ కాలంగా నెలకొన్న రాజకీయ అస్పష్టతకు తెరపడింది. పార్టీలో కీలక నేతలుగా ఉన్న బోయకొండ మాజీ చైర్మన్ ఎస్.కె. వెంకటరమణారెడ్డి, సీనియర్ నాయకుడు మాదిరాజు లక్ష్మణ రాజు (పతిరాజు) తమ మధ్య ఉన్న విభేదాలను పక్కనబెట్టి చేతులు కలిపారు. ఈ ఐక్యతతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో చౌడేపల్లి మండలంలో తిరుగులేని ఆధిక్యత సాధిస్తామని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. అగస్త్యేశ్వర స్వామి సన్నిధిలో ఐక్యతా ఘట్టం గత కొంతకాలంగా ఎడ ముఖం పెడముఖంగా ఉన్న ఈ ఇద్దరు నేతలను ఒకే వేదికపైకి తెచ్చేందుకు మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్, మండల సీనియర్ నాయకుడు ఆవుల రామచంద్రయ్య మరికొందరు సీనియర్ నాయకులు కీలక పాత్ర పోషించారు. ఆగస్త్యేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో వీరి సమక్షంలో చర్చలు జరిపి, ఇరువురి మధ్య ఉన్న పొరపొచ్చాలను తొలగించారు. స్వామివారి సాక్షిగా ఇద్దరు నేతలు పాత పగలను మరచి ఆత్మీయంగా కరచాలనం చేసుకున్నారు. గతంలో వ్యక్తిగత, వ్యూహాత్మక కారణాల వల్ల వీరు అధిష్టానం వద్ద పరస్పర ఆరోపణలు చేసుకునేవారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ విడివిడిగా ఉండటం వల్ల పార్టీకి, కార్యకర్తలకు తీవ్ర నష్టం జరుగుతుందని గ్రహించిన ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు వీరిని ఏకం చేయడంలో సఫలీకృతమయ్యారు. ఆలయంలో కలయిక అనంతరం ఇద్దరు నేతలు ఒకరి ఇళ్లకు ఒకరు వెళ్లి స్నేహపూర్వక వాతావరణంలో చర్చించుకోవడంతో కార్యకర్తల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమయ్యాయి. ఇద్దరు దిగ్గజ నేతలు కలవడంతో క్షేత్రస్థాయి కార్యకర్తలకు కొండంత అండ లభించినట్లయింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్షాలకు గట్టి పోటీ ఇచ్చేందుకు, వార్డు స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసే దిశగా ఇద్దరు నేతలు నాయకులు కార్యకర్తల సమక్షంలో చర్చించుకున్నారు నేతల మధ్య ఇదే ఐక్యత కొనసాగితే చౌడేపల్లి మండలంలో టీడీపీకి తిరుగుండదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇద్దరు కీలక నేతల కలయికతో చౌడేపల్లి మండలంలో పార్టీ గ్రాఫ్ ఒక్కసారిగా పెరిగిందని పలువురు అన్నారు నాయకుల ఐక్యతే ఆయుధంగా రాబోయే ఎన్నికల్లో విజయం సాధించి తీరుతామని స్థానిక టీడీపీ శ్రేణులు పిలుపునిచ్చాయి.

## ముఖ్యమంత్రికి ధన్యవాదములు తెలిపిన ఏపీఎన్‌జిజివోస్ అసోసియేషన్ నాయకులు




రాయచోటి, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త:
ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న కీలక నిర్ణయాలపై ఏపీ ఎన్.జి. వోఖిస్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, జిల్లా జేఏసీ ఛైర్మన్ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యయమహిల విభాగ కార్యవర్గ సభ్యులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, రాష్ట్ర అధ్యక్షులు, జేఏసీ ఛైర్మన్ అలపర్తి విద్యాసాగర్‌కు కృతజ్ఞతలు తెలియజేసి, రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్, అన్నమయ్య జిల్లా జేఏసీ తరఫున నాయకులు కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. వేణుగోపాల్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ :ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాలు వారికి ఎంతో ప్రయోజనం చేకూర్చనున్నాయని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి ఉద్యోగుల సమస్యలపై తీసుకున్న నిర్ణయాలు12వ పి ఆర్ సి చైర్మన్ నియామకానికి అంగీకారం. రెండు డీఏలను 2026 అక్టోబర్ 1 నుంచి చెల్లించేందుకు నిర్ణయం, 01072024, 01012025 డీఏలను విడుదల చేసేందుకు అంగీకారం, 2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవ్‌లను వచ్చే సంక్రాంతి నాటికి ఉద్యోగుల ఖాతాల్లో జమ చేసేందుకు నిర్ణయం, పోలీసులకు ఒక అదనపు సరెండర్ లీవ్‌ను ఈ దసరాకు చెల్లించేందుకు అంగీకారం, అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను 2027 జనవరి నుంచి అమలు చేసేందుకు నిర్ణయం, 70 ఏళ్లు దాటిన పెన్షనర్లకు 10 శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం మేర అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ వర్తింపజేయాలని నిర్ణయం, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (నిబీఖీ)ను క్రమబద్ధీకరించడంతో పాటు, వచ్చే నెల నుంచి ప్రతి నెలకు సంబంధించిన చెల్లింపును అదే నెలలో ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్‌కు చెల్లించేందుకు అంగీకారం, ఈ నిర్ణయాల అమలుతో ప్రభుత్వం ప్రతి సంవత్సరం సుమారు రూ. 2,880 కోట్ల అదనపు వ్యయాన్ని భరించనుందన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఏపీ జేఏసీ సెక్రటరీ ఏ శివారెడ్డి, నాయకులు హరిబాబు, రవీంద్రారెడ్డి, మహాదేవ, శివారెడ్డి, ప్రతిభకుమారి, నరసింహులు, స్వరనలత, పార్వతమ్మ, అనసుయ, సందీప్, అంజద్‌భాష, మున్నావార్, గోపి , ప్రదీప్, మురళి, మధు మరియు ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పులివెందుల బద్వేల్ లో క్రెడిట్ సొసైటీ బ్రాంచ్‌లు ఏర్పాటు చేయండి



వేంపల్లి, సెప్టెంబర్ 06 ప్రభాతవార్త
కడప జిల్లాలో అదనంగా రెండు ప్రాంతాల్లో బ్రాహ్మణ క్రెడిట్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లు ఏర్పాటు చేయాలనీ కడప జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పీవీయెస్ వి ప్రసాదరావు ఒక ప్రకటనలో కోరారు. 2015 లో బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన తర్వాత బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలు ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా 75 వేల మంది బ్రాహ్మణలు సభ్యత్వం కలిగి వున్న క్రెడిట్ సొసైటీ కార్యాలయాలు ప్రస్తుతం జిల్లా కు ఒకటి ఉన్నాయని వాటి సంఖ్య పెంచవలసిన అవసరం ఉందని అన్నారు. జిల్లా కేంద్రంకు 70కిలోమీటర్లు దూరంలో వున్న ప్రాంతాల నుండి బ్రాహ్మణులు కేంద్ర కార్యాలయంలకు రాలేక వున్నారని సభ్యత్వాలు పెరగడం లేదని అన్నారు. జిల్లాలోని బద్వేల్ పులివెందుల ప్రాంతాలలో కార్యాలయాలు ప్రారంభిస్తే బ్రాహ్మణులుకు అందుబాటులో ఉండటమే కాక నిరుద్యోగ బ్రాహ్మణులకు ఉద్యోగ అవకాశం వస్తుందని అన్నారు. బాపట్ల లో ఏర్పాటు చేసినట్లుగా కడప జిల్లాలో కూడా ఏర్పాటు చేయాలనీ డిమాండ్ చేశారు. వీటితో పాటు ప్రకాశం సత్య సాయి జిల్లా ల లోని బ్రాహ్మణులు అందుబాటులో ఉంటుందని అన్నారు.

## కోడి పందేలపై పోలీసుల దాడి ఆరుగురు అరెస్టు

### రూ. 22,500 నగదు, కోడి స్వాధీనం



వేంపల్లె, సెప్టెంబర్ 06 ప్రభాతవార్త
మండలంలోని టి.వెలమవారి పల్లి గ్రామంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో సీఐ. నరసింహులు ఆదేశాల మేరకు ఎస్సై తిరుపాల్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా కోడి పందేలు నిర్వహిస్తున్న ఆరుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 22,500 నగదు, ఒక కోడిని స్వాధీనం చేసుకున్నారు. కోడి పందేలు, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తిరుపాల్ నాయక్ హెచ్చరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# వినాయక మంటపాలకు పోలీస్ అనుమతులు తప్పనిసరి: ఎస్సై హారిక



సిద్ధవటం, సెప్టెంబర్6 ప్రభాతవార్త :
వినాయక మంటపాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పోలీస్ శాఖ నుండి ముందస్తు అనుమతి తీసుకోవాలని అనుమతులు లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధమని మండల ఎస్సై హారిక తెలిపారు ఈ సందర్భంగా ఆమె మండల కేంద్రమైన సిద్ధవటం పోలీస్ స్టేషన్లో ఆదివారం మాట్లాడుతూ 14 నుండి గణేష్ ఉత్సవాలు సందర్భంగా కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు వినాయక విగ్రహాల ఏర్పాటుకు ఉత్సవ కమిటీ సభ్యులు తప్పనిసరిగా పోలీస్ శాఖ నుండి ముందస్తు అనుమతి తీసుకోవాలని మండపాల వద్ద డీజేలకు అనుమతించమని అనవసరంగా డీజే లకు అడ్వాన్సులు ఇచ్చి మీ డబ్బులు వృధా చేసుకోవద్దని సూచించారు గణేష్ మండపాల వద్ద భద్రత కోసం సీసీ, కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ ప్రమాదాలు జరగకుండా మంట పాలను విద్యుత్ లైన్లకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలని, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు మండపాల వద్ద ప్రజలకు, వాహనాల రాకపోకలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగు ఏర్పాటు చేసుకోవాలని పండుగను ప్రశాంతంగా జరుపుకొని పోలీస్ శాఖ చూపించిన ప్రదేశాలలో వినాయకుని నిమజ్జనం చేయాలని సూచించారు 18, గ్రామపంచాయతీలో వినాయకుని మండపాల వద్ద అనవసర గొడవలు సృష్టిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు

## నూతన పెన్షన్లకు దరఖాస్తులు ఆహ్వానం

కలకడ సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:
నూతన పెన్షన్లకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో భాను ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వారు పెన్షన్ విధి విధానాలు ఖరారు చేయడం జరిగినది. దీని ప్రకారం ఈనెల ఏడవ తేదీ నుండి 16వ తేదీలోగా దరఖాస్తులను చేసుకోవాలని ఆయన కోరారు. ఎవరైతే పెన్షన్లకు అర్హులు ఉన్నారో వారు వారి వారి పంచాయతీ డెవలప్మెంట్ అధికారులు ద్వారా సచివాలయం డిజిటల్ అసిస్టెంట్/వెల్ఫేర్ !! ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ద్వారా మీ మీ స్వర్ణ గ్రామం నుండి పెన్షన్ అప్లికేషన్ లను నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. పెన్షన్లకు దరఖాస్తు చేసుకున్న వారు పెన్షను నమోదు చేసినట్టుగా రసీదు పొందాలన్నారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయంలోని సిబ్బంది అందరూ కలిసికట్టుగా ఉండి పెన్షన్ అప్లై చేయడానికి వచ్చే వారికి సహాయపడి, ఎటువంటి ఇబ్బంది రాకుండా చూడాలని సిబ్బందికి కోరినట్లు తెలిపారు.

# బీజేపీ మండల కమిటీ సమావేశంలో పార్టీ బలోపేతానికి కార్యాచరణ

### భారతీయ జనతా పార్టీలోకి పలువురు యువకుల చేరిక



మైదుకూరు, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త:
మైదుకూరు పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బీజేపీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యలపై పోరాటం, రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు తదితర అంశాలపై నాయకులు, మండల కమిటీ సభ్యులు విస్తృతంగా చర్చించారు. రామ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి మాచనూరు సుబ్బారాయుడు ముఖ్య అతిథిగా హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బీజేపీ నాయకుడు వడ్ల దేవేంద్ర అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలు, పార్టీ చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులైన పలువురు యువకులు బీజేపీలో చేరారు. కొండయ్య, రాజేష్, వెంకటేశ్వర రాజులను పార్టీ నాయకులు బీజేపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ సీనియర్ నాయకులు రాజమోహన్ రెడ్డి, రామకృష్ణ, మండల కమిటీ సభ్యులు, ఇతర నాయకులు, కార్యకర్తల సమక్షంలో యువకుల చేరిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యువత రాజకీయాల్లో చైతన్యవంతంగా పాల్గొని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, యువతకు అవకాశాల కల్పనే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ పనిచేస్తోందని పేర్కొన్నారు. మైదుకూరు పట్టణంలో బీజేపీ సంస్థాగతంగా మరింత బలోపేతం అవుతోందని, యువత స్వచ్ఛందంగా పార్టీలో చేరడం పార్టీ నాయకులు, కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోందని తెలిపారు. రానున్న రోజుల్లో మండలంలోని ప్రతి గ్రామం, ప్రతి వార్డులో పార్టీని మరింత విస్తరించేందుకు సమష్టిగా కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గోపవరంలో వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలోకి 500 కుటుంబాలు



గోపవరం. సెప్టెంబర్ 6 ప్రభాతవార్త.
గోపవరం మండలంలో టీడీపీకి భారీ బలం.. వైఎస్సార్‌సీపీకి చెందిన సుమారు 500 కుటుంబాలు తెలుగు దేశం పార్టీలో చేరారుగోపవరం మండలంలోని వివిధ గ్రామాలు, పంచాయతీలకు చెందిన వైఎస్సార్‌సీ పినాయకులు, కార్యకర్తలు, వారికుటుంబ సభ్యులు కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు భూపేష్ సుబ్బరామిరెడ్డి , బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి సమక్షంలో తెలుగు దేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు నారపరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కలువాయి విజయభాస్కర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నారపరెడ్డి నరసింహారెడ్డి, మల్లికార్జున రెడ్డి తదితరులు టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రంలోకొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. 350 కుటుంబాల చేరికతో గోపవరం మండలంలో తెలుగుదేశం పార్టీ మరింతబలోపేతమైందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరింత మంది టీడీపీ కుటుంబంలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బద్వేలు నియోజకవర్గ టీడీపీ నాయకులు, గోపవరం మండలంలోని వివిధ పంచాయతీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఫోటోలు మార్ఫింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

### యూఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్



మదనపల్లె, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :
విద్యార్థునుల ఫోటోలు మార్ఫింగ్ చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు సర్వేపల్లి నరసింహా డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విద్యార్థులకు రక్షణ కల్పించడంలో కళాశాలల యాజమాన్యాలు కూడా విఫలం చెందుతున్నాయన్నారు. ప్రైవేటు జూనియర్ కళాశాలలోచదువుతున్న విద్యార్థునుల ఫోటోలను తీసి అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి సోషల్‌మీడియా పోస్టులు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థునుల ఫోటోలు మార్ఫింగ్ చేసిన ఘటన చాలా దురదృష్టకరమన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకొని వెంటనే అరెస్టు చేయాలన్నారు. కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపకుల పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకొంటున్నాయని ఆయన అన్నారు. ఈ ఘటనపై ఇంటర్‌మీడియట్ బోర్డు జిల్లా స్థాయి అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అఫ్రీద్, కమలాకర్ నాయుడు, గణేష్, సుల్తాన్‌లు పాల్గొన్నారు.

# దూదేకులు అన్ని రంగాల్లో రాణించాలి

### ఎమ్మెల్యే షాజహాన్‌బాషా




మదనపల్లె, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :
దూదేకుల కులస్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాలులో ఆంధ్రప్రదేశ్ ముస్లిం నూర్‌బాషా దూదేకుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యేషాజహాన్‌బాషా మాట్లాడుతూ రాజకీయ చైతన్యంతో దూదేకుల ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ముస్లింలు 40లక్షలకు పైగా ఉన్నారని వారిలో 12లక్షల మంది నూర్‌బాషా దూదేకుల కులానికి చెందిన వారు ఉన్నారన్నారు. జనాభా దామాస ప్రకారం రాష్ట్రంలో చట్టసభలలో దూదేకులకు అవకాశం కల్పించాలని ఆసంఘం అధ్యక్షులు నూర్‌మహ్మద్ వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దూదేకుల కులస్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు చైతన్యవంతులుగా ఉండాల న్నారు. ప్రధానంగా విద్యారంగంలో రాణించాలన్నారు. విద్యతో ఏదైనా సాధించవచ్చునని, రాజకీయ చైతన్యం కలిగి రాబోయే ఎన్నికల్లో తమ సత్తాను చాటాలని గుర్తుచేశారు. దూదేకుల కులస్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని తక్షణం పరిష్కరించాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఫీర్ మహమ్మద్, జిల్లా అధ్యక్షులు షకిరాఅహ్మద్, ఇందాతుల్లా, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంలో కషాయాల తయారీ



తంబళ్లపల్లె సెప్టెంబర్ 6 ప్రభాతవార్త ః
మండలంలోని గుండ్లపల్లి పంచాయతీలో ఏడాదిగా స్థానిక రైతులు ప్రకృతి వ్యవసాయంలో భాగంగా వేరుశనగ, మొక్కజొన్న, కంది, మామిడి, అల్లనేరేడు తో పాటు కూరగాయలు, ఆకు కూరలకు సేంద్రియ ఎరువులు, కషాయాలతోనే పంటలు పండిస్తున్నారు. మండలంలో ఎల్ నినో ప్రభావంతో వర్షాలు కురవక అరకురా సాగునీటితో పెట్టిన పంటలకు పొలాల్లోనే కషాయాలు తయారుచేసి పంటలకు పిచికారి చేసి సత్ఫలితాలు సాధిస్తున్నారు. ఈ సందర్భంగా రైతు వేటా మల్లికార్జున మాట్లాడుతూ ఏడాదిగా పోర్డు స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ లలితమ్మ, ఆర్గనైజర్ రమణల అవగాహనతో ప్రకృతి వ్యవసాయంతో పంటలు పండించి అధిక దిగుబడి తో పాటు గిట్టుబాటు ధర పొందామని భవిష్యత్తులో సైతం ప్రకృతి వ్యవసాయమే ధ్యేయంగా వ్యవసాయం కొనసాగిస్తామన్నారు.

# జనసేన కడప పార్లమెంట్ సహాయక బృందం సభ్యుడిగా దాసరి రవిశంకర్

### స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి భాగస్వామ్య పక్షాలతో సమన్వయం



వేంపల్లె, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త:
రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసే చర్యల్లో భాగంగా జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కడప, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గాలకు సమన్వయ కమిటీలను నియమించారు. జనసేన పార్టీ కడప పార్లమెంట్ సహాయక బృందం సభ్యుడిగా పులివెందుల నియోజకవర్గం, వేంపల్లె పట్టణానికి చెందిన దాసరి రవిశంకర్‌ను ఆ పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ సందర్భంగా దాసరి రవిశంకర్ మాట్లాడుతూ తనను కడప పార్లమెంట్ సహాయక బృందం సభ్యుడిగా నియమించినందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలను సమన్వయం చేయడంతో పాటు కూటమి భాగస్వామ్య పక్షాలతో క్షేత్రస్థాయిలో సమన్వయం చేయడం కమిటీల బాధ్యతగా ఉంటుందన్నారు. నియమిత సభ్యులకు ఈ నెల 9న ఉదయం 10 గంటలకు మంగళగిరిలో ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు దాసరి రవిశంకర్ తెలిపారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యా ప్రయత్నం



రామసముద్రం, సెప్టెంబరు 6ప్రభాతవార్త :
కుటుంబ కలహాల ఓ వ్యక్తి విష ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన రామసముద్రం మండలంలోని మూగపర్పల్లెలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పి. మధుసూదన్‌రెడ్డి(47) కుటుంబ కలహాల కారణంగా విశద్రావణం తాగడంతో అస్వస్థతకు గురయ్యారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే రామసముద్రం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం మదనపల్లికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

## జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే చేతులు మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న వెంకటరమణ



రామసముద్రం సెప్టెంబర్ 6 ప్రభాతవార్త
డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 138వ జయంతి సందర్భంగా, అన్నమయ్య జిల్లాలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో జడ్.పి.హెచ్.ఎస్, మట్లవారిపల్లి హైస్కూల్ సోషల్ సైన్స్ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న ఎం. వెంక టరమణ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును స్వీకరించారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మదనపల్లె శాసనసభ సభ్యులు షాజహాన్ బా షా, అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి డా. కె. సుబ్రహ్మణ్యం చేతుల మీ దుగా ఈ అవార్డును అందుకున్నారు. హెచ్ ఎం వెంకటరమణ నాయుడు, రిటైర్ తూర్పు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమలత, స్కూల్ చైర్మన్ టి. కృష్ణప్ప, సి ఆర్ పి సందూరి దామోదర్, సహచర ఉపాధ్యాయులు, మండల ప్రజాప్రతినిధులు, పెద్దకురపల్లె గ్రామ పంచాయతీ ప్రజలు అభినందనలు తెలిపారు.

## శ్రీకృష్ణ విగ్రహంతో ఘనంగా ఊరేగింపు



కలసపాడు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:
త్రైత సిద్ధాంత ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను కలసపాడు మండలంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించి గ్రామ పురవీధుల్లో భక్తుల సందడితో ఊరేగింపు నిర్వహించారు. బ్యాండ్ వాయిద్యాల నడుమ శ్రీకృష్ణ నామస్మరణ చేస్తూ భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఊరేగింపులో కోలాటాలు, భజనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణుడిపై తమ భక్తిని చాటుకున్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఊరేగింపుతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పలువురు భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి ప్రాధాన్యతను నిర్వాహకులు భక్తులకు వివరించారు. శ్రీకృష్ణుడి బోధనలు, ధర్మం, సత్యం, న్యాయం పట్ల ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. వేడుకల్లో భాగంగా భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమం ప్రశాంతంగా, ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. త్రైత సిద్ధాంత నిర్వాహకులు, భక్తులు, గ్రామస్థులు కలిసి వేడుకలను విజయవంతం చేశారు.

## మహమ్మద్ ప్రవక్త పుట్టిన నెలను పురస్కరించుకొని గ్యార్మీ ఫాతేహా



సిద్దవటం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:
మహమ్మద్ ప్రవక్త పుట్టిన నెలను పురస్కరించుకొని జనసేన నాయకులు గౌస్ బాషా ఆదివారం గ్యార్మీ ఫాతేహాను నిర్వహించి పేదలకు అన్నదాన నిర్వహించడం జనసేన నాయకులు గౌస్ బాషా నిర్వహించడం సంతోషక రమని సజ్జాదే నషీన్ పీర్ సయ్యద్ షబ్బీర్ ఆలం ఖాద్రి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ముస్లిం సహోదరులు మహమ్మద్ ప్రవక్త సూచించిన మార్గంలో నడవాలన్నారు. ఆయన పుట్టిన నెలలో పేద ప్రజలకు అన్నదానం నిర్వహించి వారి ఆకలిని తీర్చడం అభినందనీయమని కొనియాడారు. ముస్లిం మండల మైనార్టీ జనసేన పార్టీ నేత గౌస్ బాషా మాట్లాడుతూ నిరుపేదలకు అండగా మహమ్మద్ ప్రవక్త పుట్టిన నెలను పురస్కరించుకొని కడుపునిండా భోజనం వసతి ఏర్పాటు చేశామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సిద్దవటం మాజీ సర్పంచ్ ఒబులయ్య, ముస్లిం మండల మైనారిటీ జనసేన పార్టీ నేత గౌస్ బాషా, ఏఎంసీ డైరెక్టర్, మహబూబ్ బాషా, కరీముల్లా, ముస్లిం సహోదరులు పాల్గొన్నారు

## జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి పరామర్శ



వేంపల్లి, సెప్టెంబర్ 06 ప్రభాతవార్త:
మండలంలోని తాటిమకుల పల్లిలో వైస్సార్సీపీ కార్యకర్త అయినా వెంకట సుబ్బయ్యకు వేంపల్లి జడ్పీటీసీ సభ్యులు రవికుమార్ రెడ్డి పరామర్శించారు. అందులో భాగంగా వెంకట సుబ్బయ్య ఇటీవల గుండె ఆపరేషన్ చేసుకున్నారు. ఈ విషయాన్నీ తెలుసుకున్న ఆయన ఆదివారం వెంకట సుబ్బయ్య ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్యం పరిస్థితి గురించి తెలుసుకొని ఆయన ను పరామర్శించారు,, ఈయన వెంట కత్తలూరు మాజి సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గున్నారు,

## మదనపల్లెలో బిచ్చగత్తె అనుమానాస్పద మృతి



మదనపల్లె క్రైమ్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త.
అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం, బసినికొండ డ్రైవర్స్ కాలనీ సమీపంలో ఓ బిచ్చగత్తె చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఆదివారం ఉదయం వెలుగుచూసిన ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డ్రైవర్స్ కాలనీ పరిసర ప్రాంతాల్లో బిచ్చాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఒక మహిళ దర్గాకు సమీపంలో ఉన్న ఒక చెట్టుకు ఉరి వేలాడుతూ కనిపించింది. అయితే ఆమె ఆత్మహత్య చేసుకుని ఉండదని, ఎవరో హత్య చేసి ఆపై ఆత్మహత్యగా చిత్రీకరించడానికి చెట్టుకు వేలాడదీసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతిచెందిన మహిళ సాధారణంగా ఎవరితోనూ మాట్లాడేది కాదని, ఒకే చోట కూర్చుని ప్లాస్టిక్ బాటిళ్లు, న్యూస్ పేపర్లు, ఇతర గుజరి సామాగ్రిని ప్రోగు చేసుకుంటూ గడిపేదని తెలిపారు. దారిలో వెళ్లేవారు ఎవరైనా దయతో అన్నం పెడితే తిని అక్కడే ఉండిపోయేదని స్థానికులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఆమెది ఆత్మహత్య లేక హత్య అనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నారు.

## కొత్త పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోండి

సుండుపల్లె, సెప్టెంబర్ 06,ప్రభాతవార్త :
మండల పరిధిలోని అన్నిగ్రామాల ప్రజలు కొత్త పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏం పి డి ఒ సుధాకర్ రెడ్డి తెలియజేడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత/చేనేత కార్మికులు, మత్స్యకారులు మొదలైన వారు సెప్టెంబర్ 07 నుండి దరఖాస్తుల స్వీకరణ మరియు ,రీద్రి ప్రక్రియ ప్రారంభం అవుతుందని రైస్ కార్డ్/ఆదాయ ధృవీకరణ పత్రం, ఆధార్, సదరమ్ పత్రం (దివ్యాంగులకు), భర్త డెత్ సర్టిఫికేట్ (వితంతువులకు)తీసుకొని సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ ద్వారా ఆన్‌లైన్ అప్లై చేసి అక్నాలెడ్జ్‌మెంట్ స్లిప్ పొందాలని అధికారుల ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తయ్యాక పక్కాగా కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని తెలియజేసాడు.

## కురుడుమలై మహా గణపతికి ప్రత్యేక పూజలు



రామసముద్రం సెప్టెంబర్6 ప్రభాతవార్త
కర్ణాటక భార్డర్ లో కురుడుమలై గ్రామంలో కొలువైన మహా గణపతి స్వామివారికి ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు వినాయక శాస్త్రి గణపతి హోమం, అభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించగా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు నుండి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. స్వామి వారిని దర్శనం చేసుకున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, సాఫ్ట్ వేర్ ఉద్యోగులు, ప్రజలు స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు.

# పచ్చని పొలాలకు జపాన్ నజరానా!

### కార్బన్ క్రెడిట్లతో రైతులకు కొత్త ఆదాయ విప్లవం

### పచ్చని వ్యవసాయానికి అంతర్జాతీయ మార్కెట్ తలుపులు.. భారత్-జపాన్ ఒప్పందంతో కొత్త అవకాశాలు



పీలేరు సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:
భారత రైతులకు వ్యవసాయంతో పాటు పర్యావరణ పరిరక్షణ ద్వారా కూడా అదనపు ఆదాయం పొందే అవకాశాలు పెరుగుతున్నాయి. భారత్-జపాన్ దేశాల మధ్య అమలులోకి వస్తున్న జాయింట్ క్రెడిటింగ్ మెకానిజమ్ (రిదిలీ) ద్వారా తక్కువ కార్బన్ ఉద్గారాలు కలిగిన ప్రాజెక్టులకు అంతర్జాతీయ స్థాయిలో ఆర్థిక, సాంకేతిక అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా సహజ వ్యవసాయం, అగ్రోఫారెస్ట్రీ, బయోగ్యాస్, పునరుత్పాదక ఇంధనం, ఇంధన సామర్థ్యం వంటి రంగాలకు ఇది ప్రాధాన్యత కల్పించే అవకాశం ఉంది. భారత్-జపాన్‌లు పారిస్ ఒప్పందంలోని ఆర్టికల్ 6.2 కింద జాయింట్ క్రెడిటింగ్ మెకానిజమ్ అమలుకు సంబంధించిన నియమాలను ఆమోదించడంతో రెండు దేశాల మధ్య కార్బన్ క్రెడిట్ సహకారానికి మార్గం సుగమమైంది. ప్రాజెక్టుల ద్వారా తగ్గిన లేదా తొలగించిన గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను కొలిచి, ధృవీకరించి క్రెడిట్లుగా గుర్తించే విధానం ఇందులో ఉంటుంది.

**కార్బన్ తగ్గిస్తే ఆర్థిక విలువ**

కార్బన్ క్రెడిట్ అంటే సాధారణంగా ఒక ప్రాజెక్టు ద్వారా నిర్దిష్ట పరిమాణంలో గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు తగ్గినట్లు లేదా తొలగించబడినట్లు ధృవీకరించబడినప్పుడు దానికి కల్పించే మార్కెట్ విలువ. రైతులు నేలలో కార్బన్ నిల్వ పెంచే పద్ధతులు, చెట్ల పెంపకం, పంట అవశేషాల నిర్వహణ, నీటి-ఇంధన పొదుపు వంటి చర్యలను శాస్త్రీయంగా నమోదు చేసి ప్రాజెక్టులో భాగం చేయగలిగితే భవిష్యత్తులో కార్బన్ ఆదాయానికి అవకాశం ఏర్పడవచ్చు. అయితే ప్రతి రైతు నేరుగా జపాన్ ప్రభుత్వం నుంచి నగదు పొందుతాడని భావించడం సరికాదని నిపుణులు సూచిస్తున్నారు. జాయింట్ క్రెడిటింగ్ మెకానిజమ్ ప్రాజెక్టుకు నిర్దిష్ట శాస్త్రీయ విధానం, నిరంతర పరిశీలన, ప్రాజెక్టు ప్రామాణికత ధృవీకరణ, ఉద్గారాల తగ్గింపు నిర్ధారణ, ప్రాజెక్టు నమోదు వంటి ప్రక్రియలు అవసరం.

**ఒక్క రైతు కంటే రైతుల సమూహమే మేలు..**

చిన్న, సన్నకారు రైతులు వ్యక్తిగతంగా కార్బన్ ప్రాజెక్టులను నిర్వహించడం కష్టమయ్యే అవకాశం ఉంది. అందువల్ల రైతు ఉత్పత్తిదారుల సంస్థలు సహకార సంఘాలు, గ్రామీణ సంస్థలు, విబీవీలు, వ్యవసాయ సంస్థలు కలిసి సమూహ ప్రాజెక్టులను చేపట్టడం ద్వారా ఖర్చులను తగ్గించుకోవచ్చని వ్యవసాయ రంగ నిపుణులు చెబుతున్నారు. ఉదాహరణకు ఒక గ్రామంలోని వందలాది రైతులు కలిసి సహజ వ్యవసాయం, అగ్రోఫారెస్ట్రీ లేదా నేలలో కార్బన్ పెంపు కార్యక్రమాన్ని చేపట్టి, మొత్తం భూభాగాన్ని ఒక ప్రాజెక్టుగా అభివృద్ధి చేసే అవకాశం ఉంటుంది.

**వ్యవసాయంతో పాటు కొత్త గ్రామీణ ఉపాధి..**

కార్బన్ క్రెడిట్ ప్రాజెక్టులు విస్తరించడంతో గ్రామీణ ప్రాంతాల్లో కొత్త సేవలకు కూడా డిమాండ్ పెరగవచ్చు. నేల పరీక్షలు, కార్బన్ కొలతలు, పంటల డిజిటల్ రికార్డులు, రిమోట్ సెన్సింగ్, డ్రోన్ పర్యవేక్షణ, డేటా నిర్వహణ, ప్రాజెక్టు మానిటరింగ్ వంటి రంగాల్లో యువతకు అవకాశాలు ఏర్పడే అవకాశం ఉంది.

**ఎకరానికి ఎంత ఆదాయం?..**

కార్బన్ క్రెడిట్ ద్వారా ఎకరానికి ఖచ్చితంగా ఎంత ఆదాయం వస్తుందో ముందుగానే చెప్పడం సాధ్యం కాదు. ప్రాజెక్టు రకం, కార్బన్ తగ్గింపు పరిమాణం, ఖర్చులు, క్రెడిట్ ధర, ప్రాజెక్టు నిర్వహణ సంస్థతో రైతుకు ఉండే ఆదాయ భాగస్వామ్యం తదితర అంశాలపై ఆదాయం ఆధారపడి ఉంటుంది. అందువల్ల ఎకరానికి సంవత్సరానికి ఇంత మొత్తం ఖాయం అంటూ ప్రచారం చేసే సంస్థల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

**మోసాలకు అవకాశం లేకుండా పారదర్శకత అవసరం..**

కార్బన్ క్రెడిట్ మార్కెట్ విస్తరిస్తున్న నేపథ్యంలో రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడే అవకాశం కూడా ఉంది. ప్రాజెక్టులో చేరే ముందు రైతులు సంస్థ పేరు, ప్రాజెక్టు నమోదు, వర్తించే శాస్త్రీయ విధానం, క్రెడిట్లు ఎవరి పేరుతో జారీ అవుతాయి, రైతుకు లభించే వాటా, ఫలితాల ధృవీకరణ ఖర్చులు, ఒప్పంద కాలం వంటి వివరాలను పూర్తిగా పరిశీలించాలి. భారత్-జపాన్‌ను కేవలం రెండు దేశాల మధ్య వాతావరణ సహకారంగా కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు అనుసంధానం చేస్తే రైతుల కు కొత్త ఆదాయ మార్గం ఏర్పడే అవకాశం ఉంది. పర్యావరణాన్ని కాపాడే రైతుకు ఆర్థిక ప్రోత్సాహకం లభించేలా విధానాలు రూపొందించడం, కార్బన్ క్రెడిట్ ఆదాయంలో రైతుకు న్యాయమైన వాటా అందేలా పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేయడం ఇప్పుడు అత్యంత కీలకం. పంటను మాత్రమే కాదు.. కార్బన్‌ను కూడా విలువైన వనరుగా మార్చే సమయం వచ్చింది. పచ్చదనం రైతు భూమిలో పుడితే, దాని ఆర్థిక విలువ కూడా రైతు చేతికే చేరాలి.

..పీలేరు, ప్రకృతి వ్యవసాయ నిపుణులు, బోధిషా వలి

## ప్రజలకు సత్ఫలితాలిస్తున్న పోలీసుల పల్లెనిద్ర కార్యక్రమం

కలికిరి, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:
జిల్లా ఎస్పీ ధీరజ్ కనుబిల్లి ఆదేశాల మేరకు కలికిరి మండలంలోని పంచాయతీలలో కలికిరి సీఐ అనిల్‌కుమార్ పోలీసు పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రాత్రి వేళల్లో గ్రామాల్లో పర్యటిస్తూ సైబర్ నేరాలు, బాల్య వివాహాలు తదితర వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. స్థానిక ఎన్నికల దృష్ట్యా ప్రజలు సోదర భావంతో మెలగాలని కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రాత్రివేళల్లో గస్తీలు ముమ్మరం చేశామని చోరీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రివేళల్లో పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తుండడంతో చోరీలు, ఘర్షణలు తగ్గుముఖం పట్టాయి. అదే విధంగా పోలీసులు కార్యక్రమాలు నిర్వహిస్తే స్థానిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని ప్రజలలో మనోధైర్యం కలుగుతున్నది. ఈ కార్యక్రమాల్లో ఏఎస్సై నరసింహులు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసు సిబ్బంది పాల్గొంటున్నారు.


## అద్దెవారిపల్లి పంచాయతీలో ఇంటింటికి టీడీపీ కార్యక్రమం



కలికిరి, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:
మండలంలోని అద్దెవారిపల్లి పంచాయతీలో తెదేపా ఎస్సీ సెల్ నాయకులు సుబ్బయ్య ఆధ్వర్యంలో ఇంటింటికి టీడీపీ కార్యక్రమం ముమ్మరంగా జరుగుతోంది. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఇంటింటికి టీడీపీ కార్యక్రమం విజయవంతం చేయాలని ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించి టీడీపీ యాప్‌లో నమోదు చేయాలని ఎమ్మెల్యే కార్యకర్తలను ఆదేశించారు. దీంతో తెదేపా నాయకులు సుబ్బయ్య నిత్యం ఉదయం, సాయంత్రం ఇంటింటికి వెళ్లి పథకాలు ప్రజలకు వివరిస్తూ టీడీపీ యాప్‌లో నమోదు చేస్తున్నారు.

## కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు సీనియర్లతో భేటీలు

### పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డితో వేలూరు శ్రీనివాసరెడ్డి సమావేశం : త్వరలో జిల్లా వ్యాప్తంగా సీనియర్ నాయకులతో చర్చలు



పులివెందుల, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :
కాంగ్రెస్ పార్టీకి జిల్లాలో పూర్వవైభవం తీసుకు రావడమే లక్ష్యంగా పార్టీ సీనియర్ నాయకులతో వరుసగా సమావేశాలు నిర్వహించనున్నట్లు పీసీసీ డెలిగేట్, పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జ్ వేలూరు శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివారం కమలాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జ్, సీనియర్ నాయకుడు పొట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డితో వేలూరు శ్రీనివాసరెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ కార్యాచరణ, జిల్లాలో పార్టీ బలోపేతానికి తీసుకోవా ల్సిన చర్యలపై ఇరువురు నాయకులు చర్చించారు. కాంగ్రెస్ పార్టీకి సీనియర్ నాయకులు దూరంగా ఉండటం వల్ల పార్టీకి నష్టం జరుగుతోందని వారు అభిప్రాయపడ్డారు. సీనియర్ నాయకుల అనుభవం, సూచనలు, సేవలను పార్టీ బలోపేతానికి వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని చర్చించారు. త్వరలోనే పార్టీలో ప్రక్షాళన జరిగి సీనియర్ నాయకులకు తగిన ప్రాధాన్యత లభించి పూర్వవైభవం వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేలూరు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాంతాలకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులను త్వరలోనే వ్యక్తిగతంగా కలిసి పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. సీనియర్ నాయకులందరినీ సమన్వయం చేసుకుని కాంగ్రెస్ పార్టీని జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసి, కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నింపేలా కార్యాచరణ రూపొందించ నున్నట్లు తెలిపారు. త్వరలో జిల్లా వ్యాప్తంగా సీనియర్ నాయకులతో సమావేశాలు నిర్వహించి, వారి అభిప్రాయాలను తీసుకుని పార్టీ బలోపేతానికి అవసరమైన కార్యాచరణను రూపొందించనున్నట్లు వేలూరు శ్రీనివాసరెడ్డి, పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.

## నిరుపేద యువతి వివాహానికి మానవతా చేయూత

### అఖిల భారత మానవ హక్కుల పరిరక్షణ మండలి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

పులివెందుల, సెప్టెంబరు 6 ప్రభాతవార్త :
నిరుపేద యువతి వివాహం సందర్భంగా అఖిల భారత మానవ హక్కుల పరిరక్షణ మండలి ఆధ్వర్యంలో ఆదివారం పులివెందులలో సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వెనుకబడిన తరగతుల ఉపాధ్యక్షులు డాక్టర్ వరప్రసాద్, విలేకరి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పెళ్లికొడుకు, పెళ్లికూతురు కుటుంబ సభ్యులు, బంధువులు, అతిథులకు వారు స్వయంగా బిర్యానీ వడ్డించి సేవలందించారు. సమాజ సేవలో భాగంగా నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి వివాహ కార్యక్రమంలో సేవా కార్యక్రమాన్ని నిర్వహించిన మండలి నిర్వాహకులు, సభ్యులను ముఖ్య అతిథులు అభినందిం చారు. నిరుపేద కుటుం బాలకు తమ వంతు సహాయ సహకారాలు అందించడం అభినందనీ యమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని మండలి జాతీయ సంచాలకులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ మహబూబ్ పీరా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా, వైద్య విభాగం ప్రతినిధి షేక్ మహమ్మద్ అక్రం హుస్సేన్, రాష్ట్ర ప్రజా సంబంధాల సంయుక్త కార్యదర్శి షేక్ మాబు సుభాన్, కడప జిల్లా వైద్య, విద్యా విభాగం అధ్యక్షులు షేక్ మహమ్మద్ నజీర్, రాష్ట్ర అవినీతి నిరోధక విభాగం ఇన్‌చార్జి షేక్ మహమ్మద్ షకీర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక సభ్యులు షాహుల్, షరీఫ్, సతీష్, వంశీ, రాకేష్, కృతిక్, జ్ఞాని, రక్షిత్, లోకేష్ తదితరులు పాల్గొని సేవలందించారు. భవిష్యత్తులోనూ నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచేలా మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.



నిరుపేద యువతి వివాహ వేడుకలలో పాల్గొన్న మానవత సభ్యులు

## చిన్నారుల స్టెప్పులకు ప్రేక్షకుల కేరింతలు



కడప కార్పొరేషన్ సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:
కడప శిల్పారామంలో ఆదివారం సా. 6.30 కు సాంస్కృతి కళావేదిక పైన మిప్ప వారి సహకారంతో కడప నగరం చెందిన విజిల్ డాన్స్ అకాడమీ విద్యార్థి విద్యార్థులు మల్లెపూల పల్లకి మరి పాటకు అయ్యప్ప స్వామి దుస్తులు ధరించి స్టెప్ లతో అదరహో అనిపించారు. జానపద, శాస్త్రియ నృత్యంలతో ప్రేక్షకులు కేరింత ధ్వనులతో స్టేజి ప్రాంగణం మారు మ్రోగింది. సాంస్కృతిక కార్యక్రమాలను శిల్పారామం పరిపాలన అధికారి పి. శివ ప్రసాద్ రెడ్డి పర్యవేక్షి ంచారు.

## రెండు పంచాయతీలు ఏర్పాటు కొరకు 8న గ్రామ సభ

సుండుపల్లి,సెప్టెంబర్ 06,ప్రభాతవార్త :
మండల పరిధిలోని సోరంవారిపల్లి గ్రామ పంచాయతీ ప్రజలకు తెలియజేయడమేమనగా గతంలో ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం సోరం వారిపల్లి, గుండ్లపల్లి పంచాయతీలను కలిపి సోరం వారిపల్లి గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయడం జరిగింది. ప్రస్తుతం సోరంవారిపల్లి గ్రామ పంచాయతీని తిరిగి సోరంవారిపల్లి గుండ్లపల్లి అనే రెండు గ్రామ పంచాయతీలుగా విభజించాలనే అభ్యర్థనలు ఆయా గ్రామాల ప్రజల నుంచి అందాయి. ఈ నేపథ్యంలో ప్రజల అభ్యర్థన మేరకు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామ సభ నిర్వహించాలని నిర్ణయించారు. 2026 సెప్టెంబర్ 8వ తేదీ ఉదయం 11.00 గంటలకు సోరంవారిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించబడుతుంది. ప్రజలందరూ గ్రామ సభకు హాజరై, తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరడమైనది.


## సీఎం నిర్ణయంపై హర్షం

### మదనపల్లెలో ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో సంబరాలు



మదనపల్లె క్రైమ్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త.
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై కీలక నిర్ణయాలు తీసుకోవడం పట్ల ఏపీ జేఏసీ మదనపల్లె తాలూకా, అన్నమయ్య జిల్లా నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం మదనపల్లెలోని ఏపీ ఎన్జీవోస్ కార్యాలయం వద్ద ఏపీ జేఏసీ ప్రతినిధులు సమావేశమై ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన నిర్ణయాలకు మద్దతుగా సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ నాయకులు రెడ్డిశేఖర్, పోకల మధుసూదన్, శివప్రసాద్ మాట్లాడుతూ.. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించిన సీఎం చంద్రబాబు నాయుడుతో పాటు, సమస్యల పరిష్కారానికి కృషి చేసిన రాష్ట్ర ఏపీ జేఏసీ నాయకులు ఏ. విద్యాసాగర్, డి.వి. రమణలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కార్యాలయం ఎదుట బాణాసంచా కాల్చి, నినాదాలు చేస్తూ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని వ్యక్తిమృతి



సంబేపల్లి సెప్టెంబర్ 6 ప్రభాతవార్త
సంబేపల్లి మండల కేంద్రం ఇందిరానగర్ కాలనీకి చెందిన తమకు రమేష్ (38) ఇంట్లో ఉరి వేసుకొని ఆదివారంమృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు సంబేపల్లి మండల కేంద్రం ఇందిరానగర్‌కు చెందిన తమకు రమేష్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు, రొంపిచర్ల మండలం గుట్ట కింద హరిజనవాడకు చెందిన వాణితో పది సంవత్సరాల క్రితం వివాహమైనట్లు తెలియజేశారు వీరి మధ్య గత కొన్ని రోజులుగా మనస్పర్థలు రావడంతో భార్య వారం రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయినట్లు తెలియజేశారు వీరికి ఆరు సంవత్సరాల కుమారుడు కలరు. ఇతనికి ఒక సోదరుడు కూడా కలరు ఇతను బెంగళూరులో నివాసం ఉన్నట్లు తెలియజేశారు. భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్థాపానికి చెందిన అతను ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఉరి వేసుకుని మృతి చెందారు ఆదివారం ఫైనాన్స్ చెందిన వ్యక్తులు ఇంటికి వచ్చి తలుపు కొట్టగా తెరవకపోవడంతో తలుపు పగలకొట్టి తెరిచి చూడగా ఉరివేసుకొని మృతి చెందినట్లు గుర్తించారు ఈ విషయం స్థానిక పోలీసులకు తెలియజేయడంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మురికి గల కారణాలపై ఏఎస్ఐ బాదుల్లా అరా తీశారు ఈ విషయం భార్యకు తెలియజేసినట్లు తెలిపారు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## భర్త వేధింపుల కేసులో భర్తతో పాటు మరో ఇద్దరు పై కేసు నమోదు



లక్కిరెడ్డిపల్లి, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త
మండలంలోని కుర్నూతుల పంచాయతీలోని వాయల్ రాజు గారి పల్లెకు చెందిన లలిత అనే మహిళను వేధింపులు కేసులో భర్త రామరాజు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణంరాజు నాయక్ తెలిపారు బాధితురాలు లలిత భార్య భర్తల మధ్య మనస్కర్తలు ఉండేవి అని దీంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు భర్త వేధింపులకు తట్టుకోలేక ఒంటరిగా జీవనం సాగించేదాన్ని అయినా కూడా భర్త తమ దగ్గరకు రావాలని వేధించేవాడని శనివారం రాత్రి భర్త మరో ఇద్దరు తమరు వేధించి తనపై దాడి చేశారని వెంటనే లక్కిరెడ్డిపల్లిలో పోలీసులను ఆశ్రయించగా వారు బాధితరాదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు

## సోషల్‌మీడియాను సమాజహితం కోసం వినియోగించాలి

### రాష్ట్ర మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి

మదనపల్లె, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :
సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడంలో సోషల్‌మీడియా కీలకపాత్ర పోషిస్తోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖామంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మదనపల్లెలో ఏపియూడబ్ల్యూజె అన్నమయ్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సోషల్‌మీడియా-సమాజంపై ప్రభావం అవగాహన సదస్సుకు మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సోషల్‌మీడియాను చెడు ప్రసారాలు కాకుండా సమాజ హితం, సేవా కార్యక్రమాలు, మంచి విషయాల ప్రచారానికి వినియోగించాలని సూచించారు. గతంలో ప్రజలకు వార్తలు చేరేందుకు పత్రికలు, టెలివిజన్‌లు ప్రధాన మాధ్యమాలుగా ఉండేవని, ప్రస్తుతం సెకండ్ల వ్యవధిలోనే ప్రపంచంలోజరిగే ప్రతి పరిణామాన్ని ప్రజల ముందుకు తీసుకువచ్చే శక్తి సోషల్‌మీడియాకు ఉందన్నారు. ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడం, అనాథ ఆశ్రమాలకు అండగా నిలవడం, సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రజలను సమీకరించడం వంటి మంచి పనులకు సోషల్‌మీడియాను వారధిగా ఉపయోగించుకోవాలని సూచించారు. జర్నలిస్టులు, కెమెరామెన్‌లు సమాజం కోసం అహర్నిశలు పనిచేస్తున్నారన్నారు. వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత రెండు, మూడు దశాబ్దాలుగా పెడింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇండ్లస్థలాల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అక్రిడేషన్ కలిగిన అర్హులైన జర్నలిస్టు అందరికి ఇంటిస్థలాలు, ఇంటి పట్టాలు అందేలా కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఏపియూడబ్ల్యూజె 70వసంతాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా నిర్వహించిన సదస్సులో రాష్ట్ర అధ్యక్షులు ఐవి.సుబ్బారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండపల్లి అక్కులప్ప, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, కార్యదర్శి వంశీధర్ సూరమాల, కన్వీనర్ శ్రీనివాసగౌడ్, సీనియర్ జర్నలిస్టులు టి.షామీర్‌బాషా, జె.శ్రీనివాసులు, జివి.శివారెడ్డి, శివకుమార్, గోఫి రమణకుమార్, ఆకుల కిరణ్‌కుమార్, సురేష్, విశ్వనాథ్‌రాజు, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, ఆర్‌జె.వెంకటేష్, దొరస్వామినాయుడు, అధికసంఖ్యలో పాత్రికేయులు పాల్గొన్నారు.

## నేడు తవళం శివాలయం ఛైర్మెన్‌గా మేసా రెడ్డిమోహన్ ప్రమాణస్వీకారం



నిమ్మనపల్లె, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:
అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండలం తవళం గ్రామ పంరాయితీలో గల అటవీప్రాంతంలోని శివాలయంకు నూతన ఛైర్మెన్‌గా మేసా రెడ్డిమోహన్ నేడు సోమవారం మధ్యాహ్నం 12గంటలకు ప్రమాణస్వీకారోత్సవం చేయనున్నారు. ప్రజాప్రతినిధులు, టిడిపి కూటమి నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని నూతనంగా ఎన్నికైన శివాలయం కమిటీ సభ్యులు కోరారు. ఈయన శివాలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. పార్టీ కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొని పార్టీ పటిష్టతకు కృషి చేశారు. ఆయన పార్టీకి, దేవస్థానంకు చేసిన కృషిని గుర్తించి ఈయన తండ్రి పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపిపి స్వర్గీయ మేసా రామక్రిష్ణ పనితీరును గుర్తించుకొని ఈ పదవికి ఎంపిక చేసినట్లు కూటమి నాయకులు తెలిపారు.

## కాలువ కింద పంటలు సాగు చేయవద్దు



దువ్వూరు, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త:
ప్రస్తుతం కేసీ కెనాల్ కు వస్తున్న నీటిని చూసి రైతులు ఎటువంటి పంటలు సాగు చేయరాదని కేసీ కాలువ అధికారులు స్పష్టం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. శ్రీశైలం నుండి విడుదల చేసిన కృష్ణా జలాలు కేసీ కాలువకు రావడంతో దువ్వూరు మండలంలో కేసీ కాలువకు సుమారు 5 అడుగులు నీటితో ప్రవహిస్తుంది. ఈ నీటిని చూసి రైతులు ఎటువంటి పంటలు సాగు చేయవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. కేవలం మంచినీటి అవసరాల నిమిత్తమే ఈ నీటిని వదిలామని, ఎన్ని రోజులు వస్తుందో ఈ నీరు చెప్పలేమని అందువల్ల కేసీకాలువ రైతులు పంటలు సాగు చేయవద్దని కోరారు. కేవలం చెక్ డ్యాములు, వంకలు, చిన్నచిన్న చెరువులు నింపేందుకు మాత్రమే ఈ నీటిని వదులుతున్నామని, ఎప్పుడు ఆగిపోతుందో తెలియని పరిస్థితి ఉందని అందువల్ల రైతులు జాగ్రత్తగా పంటలు సాగు చేయకుండా ఉండాలని సూచించారు.

## వ్యాసరచన పోటీలో అఫ్రిన్‌కు బహుమతి ప్రధానం



**పీలేరు సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** పీలేరు పట్టణంలోని సియన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్స వాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన పోటీలో బిఎస్సీ విద్యార్థిని అఫ్రిన్ బహుమతి సాధించింది. భవిష్యత్తులో మీరు అధ్యాపకులైతే ఎలాంటి పాత్ర పోషిస్తారు? ప్రస్తుత విద్యా వ్యవస్థలో ఎలాంటి మార్పులు తీసుకు వస్తారు?" అనే అంశంపై నిర్వహించిన ఈ వ్యాసరచన పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యా వ్యవస్థలో అవసరమైన మార్పులు, విద్యా ర్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అధ్యాపకుల పాత్ర, గ్రామీణ విద్యార్థులు ఎదుర్కొంటున్న సవాళ్లు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై విద్యార్థులు తమ ఆలోచనలను వ్యాసాల రూపంలో వ్యక్తం చేశారు. ఈ పోటీలో బిఎస్సీ విద్యార్థిని అఫ్రిన్ తన ఆలోచనలను సమర్థవం తంగా, సృజనాత్మకంగా వ్యక్తీకరించి బహుమతిని కైవసం చేసుకుంది. ఆమె ప్రతిభను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు. కళాశాల కరస్పాండెంట్ విజయ్ భాస్కర్ రెడ్డి అఫ్రిన్‌కు బహుమతిని అందజేసి అభినం దించారు. విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించడం ద్వారా భవిష్యత్తులో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని అఫ్రిన్‌ను అభినందించారు.

## రాజంపేట పార్లమెంట్ కీలక కమిటీలో పీలేరుకు పట్టం

**జనసేన సమన్వయ టీంలో కలప రవికి ప్రత్యేక స్థానం**



**పీలేరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** రాజంపేట పార్లమెంటు పరిధిలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జనసేన పార్టీ కీలక అడుగు వేసింది. జనసేన పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు రాజంపేట పార్లమెంటు నిర్వహణ సమన్వయ కమిటీని (కోఆర్డినేషన్ టీం) నియమించింది. ఈ ప్రతిష్టాత్మక కమిటీలో పీలేరుకు చెందిన జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కలప రవి గారికి ప్రత్యేక చోటు దక్కడం పీలేరు జనసైనికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కమిటీలో కలప రవితో పాటు తాటం శెట్టి నాగేంద్ర, శ్రీమతి దారం వనిత, అతికారి కృష్ణయ్య, విరూపాక్షి తదితరులను నియమించారు. ఈ కమిటీ ముఖ్య ఉద్దేశం..రాజంపేట పార్లమెంటు పరిధిలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన టీడీపీ బీజేపీ కూటమి గెలుపే లక్ష్యంగా పార్టీల మధ్య సమన్వయం, సలహాలు, సూచనలు ఇస్తూ కూటమిని ముందుకు నడిపించడం. కలప రవి నియామకంతో పీలేరు నియోజకవర్గంలో జనసేన పార్టీ మరింత బలపడనుందని, కూటమి ఐక్యతకు ఆయన కృషి చేస్తారని కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఆర్టీసీ బస్టాండులో మూతపడ్డ మరుగుదొడ్లు

**ఇబ్బందుల్లో మహిళా ప్రయాణికులు**



**కలికిరి, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని మరుగుదొడ్లు గత 5 రోజులుగా మూతపడ్డాయి. దీంతో బస్టాండుకు వచ్చే మహిళా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండు ఆవరణలోని మోటారు మరమ్మతులకు గురికావడంతో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ సమస్య ఏర్పడింది. కనీసం ఆర్టీసీ బస్టాండులో కంట్రోలర్ లేకపోవడంతో ఆర్టీసీ అధికారుల పనితీరుపై ప్రయాణికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రయాణికులకు ఆర్టీసీ బస్సులకు సంబంధించి సమాచారం ఇచ్చే అధికారులు కూడా కరవయ్యారు. ఈ తంతు గత 6 నెలలుగా బస్టాండులో ఉంది. ఇకనైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి బస్టాండులో కంట్రోలర్ నియమించి మంచినీటి సమస్యను పరిష్కరించి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాల్సి ఉంది.

## ఎస్ఐఆర్ విచారణకు విధిగా హాజరుకావాలి

**తహసిల్దార్ శివకుమార్**



**పీలేరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** ఓటర్ల సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు తమకు కేటాయించిన విచారణ కేంద్రాలకు విధిగా హాజరు కావాలని తహశీల్దార్ ఎం. శివకుమార్, ఎంపీడీవో శివశంకర్ కోరారు. ఆదివారం స్థానిక విచారణ కేంద్రాల్లో వారు మాట్లాడుతూ పీలేరు మండలంలో 13561 మందికి నోటీసులు ఇవ్వగా ఇప్పటి వరకు 8813 మంది నోటీసులను సర్ యాప్లో తిరిగి అప్లోడ్ చేసినట్లు తెలిపారు. మిగిలిన వారు కూడా తప్పుండా విచారణ కేంద్రాలకు హాజరు కావాలన్నారు. బయట రాష్ట్రాల్లో చదువుతున్న విద్యార్థులకు బదులు వారి తల్లిదండ్రులు విచారణ కేంద్రాలకు హాజరు కావచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో యుగంధర్, ఆర్ఐ మురగయ్య, ఏఎస్వీ రెడ్డెప్పనాయుడు, సూపర్వైజర్లు, బీఎల్వోలు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం మౌనం వీడాలి

**మొదటి పేజీ తరువాయి**

ప్రకటనలు చేసిన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి కూడా తాజా ఆరోపణలపై సమాధానం చెప్పాలని అన్నారు. డీఎస్సీ అంశంపై వైఎస్సార్‌సీపీ నిర్వహించిన ర్యాలీ సందర్భంగా విద్యార్థులు పాల్గొనడాన్ని అడ్డుకునేలా వ్యవహరించా రని ఆరోపించిన ఆయన, ఇప్పుడు డీఎస్సీ నియామకాల్లో వస్తున్న ఆరోపణలపై కూటమి నాయకులు స్పందించాలని కోరారు. నిజాయితీగా పరీక్షలు రాసిన ప్రతి అభ్యర్థికి న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ వారి తరఫున పోరాటం కొనసాగిస్తుందని రామ్ లక్ష్మణ్ రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తొండూరు మండల యువ నాయకులు కంచర్ల ఆదికేశవ రెడ్డి, అరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణయ్యకు ఘన సన్మానం



ఉత్తమ ప్రధానోపాధ్యాయిని సన్మానిస్తున్న దృశ్యం

**పులివెందుల సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయునిగా ఎంపికై, శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా సన్మానం పొందిన రామకృష్ణయ్యను స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం ఆయన స్వగృహంలో ఘనంగా సన్మానించారు. సేవా సమితి అధ్యక్షుడు రాజు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణయ్య విద్యారంగానికి అందించిన సేవలు అభినందనీయ మని, ఆదర్శప్రాయమని అన్నారు. తాను పనిచేసిన ప్రతి పాఠశాలను అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కుతుం దని కొనియాడారు. అంకాలమ్మగూడూరు, వేముల, లక్కిరెడ్డిపల్లె, హిమకుంట్ల, పెద్దకుడాల పాఠశాలల్లో రామకృష్ణయ్య తన నాయకత్వ పటిమతో విద్యార్థుల సంఖ్య పెంపుతో పాటు విద్యాప్రమాణాల మెరుగుదల, మౌలిక వసతుల అభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు. ఆయన సేవలను గుర్తించి జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యా యునిగా ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉచిత విద్యా ఉపాధ్యాయ బృందం సభ్యులు గుజ్జుల కృష్ణారెడ్డి, సేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోండి

**మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**




**రాయచోటి సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద అర్హులైన వారి నుంచి కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తులను స్వీకరించనుందని ఈనెల 7 నుంచి 16 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆయన ఈ సందర్భంగా తెలియజేస్తూ: గ్రామీణ ప్రాంతాల్లో – స్వర్ణ గ్రామ కార్యాలయం, పట్టణ ప్రాంతాల్లో – స్వర్ణ వార్డు కార్యాలయాలల్లో నిర్ణీత న్యూ పెన్షన్ అప్లికేషన్ ఫారం తీసుకుని, పూర్తి వివరాలతో నింపి అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాలన్నారు. కావలసిన పత్రాలు ఆధార్ కార్డు, రైస్ కార్డు / ఆదాయ ధ్రువీకరణ పత్రం, అదనంగా, సంబంధిత పెన్షన్ కేటగిరీకి అవసరమైన ధ్రువ పత్రాలను సమర్పించా లన్నారు. వృద్ధాప్య పెన్షన్, వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డు, వితంతు పెన్షన్: భర్త మరణ ధ్రువీకరణ పత్రం + భర్త ఆధార్ వివరాలు, ఒంటరి మహిళ పెన్షన్: వివాహిత అయితే – కోర్టు/అదాలత్ జారీ చేసిన విడాకుల డిక్రీ, అవివాహిత అయితే – తహసీల్దార్ జారీ చేసిన నాన్ మ్యారేజ్ సర్టిఫికెట్, దివ్యాంగుల పెన్షన్: 40!! లేదా అంతకంటే ఎక్కువ బెంచ్ మార్క్ డిసబిలిటీ ఉన్న సదరేం సర్టిఫికెట్, చేనేత కార్మికులు సంబంధిత శాఖ సర్టిఫికెట్, మత్స్యకారులు: సంబంధిత శాఖ సర్టిఫికెట్, డప్పు కళాకారులు సంబంధిత శాఖ సర్టిఫికెట్, సాంప్రదాయ చెప్పుల తయారీదారులు సంబంధిత శాఖ సర్టిఫికెట్, తాటి తాపీలు, సంబంధిత శాఖ సర్టిఫికెట్, ట్రాన్స్‌జెండర్లు డిస్ట్రిక్ట్ మెడికల్ బోర్డ్ సర్టిఫికెట్, దరఖాస్తును స్వర్ణ గ్రామం/స్వర్ణ వార్డు కార్యాలయంలో సమర్పించాలన్నారు. సంబంధిత అధికారులు పత్రాలను పరిశీలించిన అనంతరం అర్హతను నిర్ణయిస్తారు. కావున సెప్టెంబర్ 7 నుంచి 16 వరకు దరఖాస్తు చేసుకొనే ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి రాంప్రసాద్ రెడ్డి కోరారు.

## భవిష్యత్ తరాలకు హిందూ ధర్మం సంప్రదాయాలపై అవగాహన కల్పించడమే తమ ప్రధాన ధ్యేయం : మారెళ్ళ మల్లికార్జునరావు



**ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** శ్రీ గణపతి మహోత్సవ కమిటీ శివాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాలు 50వ సంవత్సరానికి చేరుకున్న సందర్భంగా ఆదివారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో కమిటీ ప్రతినిధులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు మారెల్ల మల్లికార్జునరావు మాట్లాడుతూ ఐదు దశాబ్దాలుగా గణపతి ఉత్సవాలను ఎలాంటి విరామం లేకుండా సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రాయలసీమలో 50 సంవత్సరాలు నిరంతరాయంగా గణేష్ ఉత్సవాలు నిర్వహిస్తున్న తొలి కమిటీగా తమ ఉత్సవాలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. భవిష్యత్ తరాలకు హిందూ ధర్మం, సంప్రదాయాలపై అవగాహన కల్పించడమే తమ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ముఖ్యంగా చిన్నారుల్లో భక్తిభావాన్ని పెంపొందించే కార్యక్రమాలను ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 11 రోజుల పాటు ఉత్సవాలు, 12వ రోజు గ్రామోత్సవం అనంతరం నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రతి ఐదేళ్లకు ప్రత్యేక ఆకర్షణగా విగ్రహాలను ఏర్పాటు చేస్తూ వస్తున్నామని మల్లికార్జునరావు తెలిపారు. 25వ వార్షికోత్సవంలో ప్రత్యేక కార్యక్రమాలు, 40వ సంవత్సరంలో 40 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశామని, ఈసారి 50వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 50 అడుగుల పొడవు, వెడల్పుతో శివుని విగ్రహాన్ని ఏర్పాటు చేసి, అందులో 18 అడుగుల వినాయకుడిని ప్రతిష్ఠిస్తున్నట్లు వివరించారు. ఈ ఏడాది శివలింగ గణపతి రూపంలో భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. కమిటీ ప్రధాన కార్యదర్శి అట్ల నరసింహారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి ముందే బాలగంగాధర్ తిలక్ ప్రారంభించిన గణపతి ఉత్సవాలు నేటికీ దేశవ్యాప్తంగా కొనసాగుతున్నాయని అన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రొద్దుటూరులో మారెల్ల మల్లికార్జునరావు గణపతి ఉత్సవాలను ప్రారంభించి కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రతి ఏడాది మట్టి వినాయక విగ్రహానికే పూజలు నిర్వహించడం తమ ప్రత్యేకతగా పేర్కొన్నారు. 50వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక సావనీర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. అందులో ప్రొద్దుటూరు విశిష్టతతో పాటు పట్టణానికి చెందిన కవులు, కళాకారుల వివరాలను పొందుపరిచినట్లు చెప్పారు. ఉత్సవాల నిర్వహణకు పట్టణ ప్రజలు అందిస్తున్న సహకారం ఎంతో విలువైనదని, స్వచ్ఛందంగా విరాళాలు అందిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు, మహిళల కోసం పలు పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థినీ, విద్యార్థులకు వివిధ పోటీలు, మహిళలకు రంగవల్లుల పోటీలు, జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు క్విజ్, చదరంగం పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పీఠాధిపతుల ఆధ్యాత్మిక ప్రసంగాలు కూడా కార్యక్రమంలో ఉంటాయని చెప్పారు. సమావేశంలో కమిటీ కోశాధికారి తెల్లాకుల సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు నగరూరు చంద్రగుప్త, నాగిరెడ్డి గురివిరెడ్డి, కొప్పర్తి చంద్రశేఖర్, కార్యనిర్వాహక కార్యదర్శులు గోనా ప్రభాకర్‌రెడ్డి, తిప్పలూరు సుధీర్, కాసుల ప్రశాంత్, జాయింట్ సెక్రెటరీలు రాం పుల్లయ్య, ముత్యాల సేతురావు, క్రియాశీలక సభ్యులు సోమిశెట్టి నాగరాజు, ఉలసాల రామసుబ్బన్న, శ్రీకాకుళం వినయ్, బింగుమళ్ల సురేంద్ర, మిట్ట శివయ్య, మేడా సుబ్బరామయ్య, పిన్ను శ్రీనివాసులు, గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సంక్షేమ నిర్ణయాలపై హర్షం

**పెండింగ్ బకాయిల చెల్లింపు, అదనపు క్వాంటమ్ పెన్షన్ పునరుద్ధరణ నిర్ణయాలు అభినందనీయం**

**మైదుకూరు తాలూకా ఏపీఎన్‌జీజీఓ అధ్యక్షుడు గజ్జల చంద్రమోళి, సెక్రటరీ మాచనూరు రాఘవయ్య**




**మైదుకూరు, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త:** గత ప్రభుత్వ కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిల చెల్లింపుతో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన పలు పెండింగ్ అంశాలపై ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకోవడం అభినందనీయమని మైదుకూరు తాలూకా ఏపీఎన్‌జీజీఓ అసోసియేషన్ అధ్యక్షుడు గజ్జల చంద్రమోళి, సెక్రటరీ మాచనూరు రాఘవయ్య తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల దీర్ఘకాలిక డిమాండ్లలో భాగంగా అదనపు క్వాంటమ్ పెన్షన్ పునరుద్ధరణతో పాటు పీఆర్సీ కమిటీ నియామకానికి ప్రభుత్వం అంగీకారం తెలపడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ కాలంలో పెండింగ్‌లో ఉన్న బకాయిలను క్రమంగా పరిష్కరించడంతో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఆయా వర్గాల్లో నమ్మకాన్ని మరింత పెంచుతున్నాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు సాగడం స్వాగతించదగ్గ పరిణామమని గజ్జల చంద్రమోళి తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన మిగిలిన పెండింగ్ సమస్యలను కూడా ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని మాచనూరు రాఘవయ్య కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న సానుకూల నిర్ణయాలు ఆయా వర్గాలకు ఊరటనిస్తాయని, భవిష్యత్తులోనూ వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీఎన్‌జీజీఓ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు తాలూకా ఏపీఎన్‌జీజీఓ అసోసియేషన్ అధ్యక్షుడు గజ్జల చంద్రమోళి, సెక్రటరీ మాచనూరు రాఘవయ్య, ఉపాధ్యక్షులు రామగుప్తా, సుజాత, సంయుక్త కార్యదర్శులు సుజాత, జనార్దన్ రావుతో పాటు మైదుకూరు తాలూకా ఏపీఎన్‌జీజీఓ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# సేవా సంకల్ప్ అభియాన్‌ను విజయవంతం చేయాలి

**భాజపా జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్**




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్

**పులివెందుల, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** దేశాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథంలో నడిపిస్తూ వికసిత భారత్ లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరిపాలన సాగిస్తున్నారని భాజపా జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించు కొని ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్న సేవా సంకల్ప్ అభియాన్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం పులివెందుల భాజపా కార్యాలయంలో మండల శాఖ అధ్యక్షుడు నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ సుదీర్ఘ కాలంగా ముఖ్య మంత్రిగా, ప్రధానమంత్రిగా దేశానికి సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. దేశ రక్షణతో పాటు సార్వభౌమాధి కారాన్ని మరింత బలోపేతం చేసేలా అనేక సంస్కరణలు చేపట్టారని తెలిపారు. ప్రపంచ దేశాల్లో భారతదేశం విశ్వగురువుగా నిలిచేలా నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఆంధ్రప్ర దేశ్‌ను విద్యుత్ రంగంలో ముందంజలో నిలిపేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించడంతో పాటు అమరావతి అభివృద్ధికి కేంద్రం భారీగా నిధులు కేటాయిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రగతి కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయంతో ముందుకు సాగుతున్న తీరు అభినందనీయమని గాలి హరిప్రసాద్ అన్నారు. సేవా సంకల్ప్ అభియాన్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, లక్ష్మయ్య, కోడిమూర్తి, శ్రీరాములు, తిరుపాల్‌రెడ్డి, భారతీయ జనతా యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వాజపేయి, వెనుకబడిన తరగతుల మోర్చా నాయకుడు యుగంధర్, యువమోర్చా నాయకులు రక్షిత్‌చౌదరి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కిచెన్ స్థల మార్పు



**నందలూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** నందలూరు జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో తలపెట్టిన స్మార్ట్ కిచెన్ స్థలాన్ని మార్చేందుకు జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సానుకూలంగా స్పందించారు. క్రీడా మైదానాన్ని కిచెన్ నిర్మాణానికి వినియోగిస్తే విద్యార్థులు, క్రీడాకారులకు ఇబ్బందులు తలెత్తుతాయని సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత కొంతకాలంగా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. మైదానం ఇప్పటికే ఆక్రమణలతో కుదించుకుపోయిందని, కిచెన్ నిర్మాణంతో క్రీడాభ్యాసానికి మరింత విఘాతం కలుగుతుందని పేర్కొంటూ ఎంఈఓ, ఎంపీడీఓ, సబ్ కలెక్టర్‌లకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ అభ్యంతరాలకు వాకర్స్ అసోసియేషన్, స్వర్ణాంధ్ర మదర్‌ల్యాండ్ విక్టరీ యూత్ అసోసియేషన్, సీఏవైడీ క్రీడాకారులు, నాగిరెడ్డిపల్లి గ్రామ ప్రజలు మద్దతు తెలిపారు. ఈ అంశాన్ని రాజంపేట పార్లమెంట్ జనసేన ఇన్‌చార్జి యల్లటూరు శ్రీనివాసరాజు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. క్రీడా మైదానంలో కిచెన్ నిర్మాణం వల్ల కలిగే ఇబ్బందులను వివరించడంతో కలెక్టర్ స్పందించి, స్మార్ట్ కిచెన్‌ను ప్రత్యామ్నాయ స్థలంలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన యల్లటూరు శ్రీనివాసరాజును సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఆరుముగం విశ్వనాథ్, ఉపాధ్యక్షులు మల్లెల విజయుడు, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, సీఏవైడీ కోచ్ ఫిరోజ్ ఖాన్ లోడి, కార్యదర్శులు పఠాన్ మెహర్ ఖాన్, సయ్యద్ జుల్ఫికర్, క్రీడా కార్యదర్శి మధు తదితరులు పాల్గొన్నారు.

## ఫిజియోథెరపీ ద్వారా ఆధునిక చికిత్సతో సంపూర్ణ ఆరోగ్యం



**ప్రొద్దుటూరు అర్బన్ సెప్టెంబర్ 6 ప్రభాత వార్త** ఫిజియోథెరపీ ద్వారా ఆధునిక చికిత్సతో సంపూర్ణ ఆరోగ్య పునరావాస సేవలు అందించడమే లక్ష్యంగా వైఎంఆర్ కాలనీలో ప్రసన్న ఫిజియో అండ్ రిహాబిలిటేషన్ క్లినిక్‌ను ఆదివారం ప్రారంభించారు. డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ స్వాతిశ్రీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ క్లినిక్‌లో రోగులకు ఆధునిక ఫిజియోథెరపీ, పునరావాస సేవలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. న్యూరోలాజికల్, స్పైనల్ కార్డ్ సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రత్యేక సౌకర్యాలతో చికిత్స అందించనున్నట్లు పేర్కొన్నారు. వీల్‌చైర్ నుంచి బెడ్‌కు మారడం, నిలబడటం, నడక సాధనతో పాటు అవసరమైన వివిధ రకాల ఫిజియోథెరపీ సేవలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రోగి పూర్తిగా కోలుకునే వరకు అవసరమైన చికిత్స అందించేలా కంప్లీట్ ప్యాకేజీ విధానాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇన్‌పేషెంట్ సేవల్లో భాగంగా పీడియాట్రిక్, జెరియాట్రిక్ రోగులకు ప్రత్యేక ఫిజియోథెరపీ సేవలు అందిస్తామని చెప్పారు. చికిత్స కోసం వచ్చే ఇన్‌పేషెంట్లకు ఆహారం, వసతి సదుపాయాలు కూడా కల్పించనున్నట్లు తెలిపారు. మహిళల కోసం ప్రత్యేకంగా లేడీ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ స్వాతిశ్రీ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. గర్భిణుల కోసం ప్రసవానికి ముందు, ప్రసవానంతరం అవసరమైన ఫిజియోథెరపీ, వ్యాయామ తరగతులను డాక్టర్ స్వాతిశ్రీ నిర్వహించనున్నట్లు తెలిపారు. పిల్లలు, వృద్ధులు, నడక సమస్యలు ఉన్నవారు, న్యూరోలాజికల్, స్పైనల్ కార్డ్ సమస్యలతో బాధపడుతున్న వారికి ఒకే చోట సమగ్ర పునరావాస సేవలు అందించడమే క్లినిక్ లక్ష్యమని వివరించారు. డాక్టర్ స్వాతిశ్రీ గతంలో ట్రినిటీ ఆటిజం సెంటర్‌లో సేవలు అందిస్తూ, మరింత విస్తృతంగా ఫిజియోథెరపీ సేవలను అందించాలనే ఉద్దేశంతో ప్రొద్దుటూరులో ఈ క్లినిక్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు అందుబాటులోకి వచ్చిన ఆధునిక ఫిజియోథెరపీ, పునరావాస సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణం లోని ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.

## భూపేష్ రెడ్డిని కలిసిన టిడిపి నాయకులు



**కలసపాడు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** మండలంలోని తెలుగుదేశం నాయకులు మన్నూరు సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు భూపేష్ రెడ్డిని ఆదివారం బద్వేల్‌లో పూల మాలవేసి సత్కరించారు. ఆయన బాల్రెడ్డిని కలసపాడు మండలం గురించి అడిగి తెలుసుకున్నారు. పాముూరు బాల్రెడ్డి మాట్లాడుతూ కలసపాడులోని కొన్ని పనులను ఆయన దృష్టికి తెచ్చారు. ఆయన త్వరలో వాటిని సరి చేస్తామని నేను తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, కొండయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

## అన్నమయ్య జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయాలు, పోస్టుల తరలింపును నిలిపివేయాలి

**మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు వినతిపత్రం అందజేత**




**మదనపల్లె క్రైమ్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త.** అన్నమయ్య జిల్లా మదనపల్లె కేంద్రంగా ఉన్న ఎక్సైజ్ శాఖ కార్యాలయాలు, పోస్టులు మరియు విభాగాన్ని (బిఎంపిపి విభాగం) ఇతర జిల్లాలకు తరలించే ప్రతిపాదనలను వెంటనే నిలిపివేయాలని కోరుతూ మదనపల్లె శాసనసభ్యులు ఎం. షాజహాన్ బాషా గారికి ఎక్సైజ్ అధికారులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నూతనంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాలో కర్ణాటక సరిహద్దు ప్రాంతాలతో దాదాపు 100 కిలోమీటర్లకు పైగా విస్తరించి ఉన్నందున, గంజాయి, నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ మరియు నాటు సారా అక్రమ రవాణాను అరికట్టడంలో మదనపల్లెలో కొనసాగుతున్న ఎక్సైజ్ బిఎంపిపి వింగ్ అత్యంత కీలకమన్నారు.. అటువంటి ముఖ్యమైన విభాగాన్ని, పోస్టులను పక్క జిల్లాకు తరలించడం వల్ల జిల్లాలో ఎక్సైజ్ శాఖ బలహీనపడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లాకు చెందిన ఏ ఒక్క పోస్టును, ఆఫీసును లేదా విభాగాన్ని ఇతర జిల్లాలకు తరలించకుండా నిలిపివేసి, జిల్లా కేంద్రంలో ఎక్సైజ్ శాఖను మరింత బలోపేతం చేసేలా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ విజ్ఞప్తిపై స్పందించిన ఎమ్మెల్యే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## పదోన్నతులు పొందిన నాయకులకు ఘన సన్మానం



**పులివెందుల, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** పులివెందుల పట్టణంలోని గంగమ్మ చింతల దేవస్థానంలో ఆదివారం పదోన్నతులు పొందిన నాయకులను మెప్‌ఎఫ్, ఎంఆర్‌పీఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. యుసీఐఎల్ సంస్థలో సహాయ పర్యవేక్షకులుగా పదోన్నతి పొందిన మెప్‌ఎఫ్ నాయకులు అడవిరాము డు, చిరంజీవి, మహేంద్రలను అలాగే రాష్ట్ర ఇంజినీర్ల సంఘం, రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగం కార్యదర్శిగా పదోన్నతి పొందిన జేసీ రామాంజనే యులును నాయకులు అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పదోన్నతులు పొందిన వారు భవిష్యత్తు లో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ రామకృష్ణ, శ్రీనివాస్ పిళ్లై, ఎస్. గంగన్న, కత్తి శ్రీను, కత్తి శ్రీనివాసులు, రామసుబ్బ య్య, కాళ్ల భాస్కర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి



**సుండుపల్లి, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త :** విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, వారికి నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌భూపాల్‌రెడ్డి సూచించారు. ఆదివారం సుండుపల్లి మండల కేంద్రం సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను టీడీపీ నాయకుడు చప్పిడి మహేష్ నాయుడుతో కలిసి ఆయన సందర్శించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, విద్యార్థినులకు అందిస్తున్న భోజనం నాణ్యత, రుచి, మెనూ అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటలను రుచి చూసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలు, పాఠశాలలో అందుతున్న వసతుల గురించి తెలుసుకున్నారు. విద్యార్థినులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించడంతోపాటు విద్య, వసతి, మౌలిక సదుపాయాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థినుల ఆరోగ్యం, భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వ పథకాల అమలులో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఎమ్మెల్సీ సూచించారు. ఈ కార్యక్రమంలో రాయవరం టీడీపీ నాయకుడు శంకర్, పాఠశాల సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.